# మనజనప్రగతి


జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక

సంపుటి : 6 సంచిక : 172 పేజీలు : 8 వెల : రూ.2/- శనివారం 18 జులై 2026 వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


## రాష్ట్రాభివృద్ధిలో బ్యాంకులు
# భాగస్వామ్యం కావాలి

- రుణ వితరణ కార్యక్రమంతో వ్యాపారవేత్తలుగా సామాన్యులు
- సంక్షోభంలో ఉన్న రాష్ట్రానికి నిర్మాలాసీతారామన్ సహకారం
- కూటమి వచ్చాక రుణాల రీ- షెడ్యూల్‌తో రూ.1538 కోట్లు ఆదా
- నరసరావుపేట రుణ వితరణ మేళాలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- వివిధ వర్గాలకు రూ.3,216 కోట్లు పంపిణీ చేసిన సీఎం, కేంద్ర మంత్రి





**నరసరావుపేట, మన జనప్రగతి జూలై 17:** ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో బ్యాంకులు భాగస్వామ్యం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. ప్రజల వద్దకే వెళ్లి రుణాలు అందించటం గర్వకారణమని, బ్యాంకులు రుణాలిచ్చే సంస్థలే కాదని రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములన్నారు. రైతు భవిష్యత్తు మార్చడానికి, యువత కలలు నెరవేర్చడానికి, పారిశ్రామికవేత్తల లక్ష్యం నెరవేరడానికి రుణాలు ఎంతో ఉపయోగపడతాయని వ్యాఖ్యానించారు. గత వైసీపీ పాలనంతా సమస్యల సుడిగుండమేనని ముఖ్యమంత్రి చంద్రబాబు మిగతా2లో...



## భారతీయ రైల్వే చరిత్రలో
# మరో మైలురాయి

- హైడ్రోజన్ రైలుతో నూతన శకం ఆరంభం
- తొలి రైతులను జెండా ఊపి ప్రారంభించిన మోడీ
- అనేక ప్రత్యేకతలతో పర్యావరణహితంగా తయారీ

**న్యూఢిల్లీ,మన జనప్రగతి జూలై 17:** దేశంలోనే మొట్టమొదటి హైడ్రోజన్ పవర్డ్ రైలును ప్రధాని మోదీ శుక్రవారం హర్యానాలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ రైలు హర్యాలోని జింద్, సోనిపట్ మధ్య (89 కి.మీ) నడవనుంది. పర్యావరణ పరిరక్షణకు, పచ్చదనాన్ని కాపాడుకోవడానికి రైల్వే వ్యవస్థలో ఇది ఒక చరిత్రాత్మక ముందడుగు అని ఈ సందర్భంగా ప్రధాని మోదీ అన్నారు. స్వదేశీ పరిజ్ఞానంతో దీన్ని తయారు చేయడం దేశ గర్వకారణమని వెల్లడించారు. అధునాతన రైల్వే ఇంజినీరింగ్‌లో దేశ సామర్థ్యాలకు ఇది మిగతా2లో...




## అమృత్ పథకంలో మంగళగిరి స్టేషన్
# ఆధునీకరణ

- వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోడీ
- దేశ సర్వతోముఖాభివృద్ధికి రైల్వేలు ఎంతో కీలకం: లోకేశ్

**మంగళగిరి,మన జనప్రగతి జూలై 17:** దేశ సర్వతోముఖాభివృద్ధికి రైల్వేలు ఎంతో కీలకమని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. కనెక్టివిటీ పెరిగితేనే ప్రగతి సాధ్యమవుతుందని చెప్పారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం మిగతా2లో...

# అడవి ఏనుగు పట్టివేత


- ఏనుగును పట్టుకునేందుకు నెల రోజులపాటు ప్రత్యేక ఆపరేషన్
- ఆపరేషన్ కోసం అధునాతన డ్రోన్లు, థర్మల్ సెన్సర్ కెమెరాల వినియోగం
- తుది అంకంలో పాల్గొన్న ఐదు కుంకీ ఏనుగులు, అటవీ సిబ్బంది, పశువైద్య నిపుణులు
- గతంలో అటవీ సెక్షన్ అధికారి శ్రీ సుకుమార్ పై దాడి చేసి గాయపర్చిన ఏనుగు
- గాయాల నుంచి కోలుకుని ఆపరేషన్‌లో పాల్గొన్న శ్రీ సుకుమార్
- ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించిన అటవీ సిబ్బిందికి పవన్ అభినందనలు
- సెక్షన్ ఆఫీసర్ శ్రీ సుకుమార్ ధైర్యాన్ని మెచ్చుకున్న ఉప ముఖ్యమంత్రి



**పలమనేరు,మన జనప్రగతి జూలై 17:** గత కొంత కాలంగా పలమనేరు పరిసరాల్లో సంచరిస్తూ పంటలను ధ్వంసం చేస్తూ, సమీప గ్రామాల ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న ఒంటరి మగ అడవి ఏనుగును ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ విజయవంతంగా బంధించింది. ఈ ఏనుగును బంధించేందుకు అటవీశాఖ ఉన్నతాధికారులతో పాటు క్షేత్ర స్థాయి సిబ్బంది నెల రోజులకుపైగా చెమటోడ్చాల్సి వచ్చింది. సుమారు 15 నుంచి 18 సంవత్సరాల వయస్సు కలిగిన మిగతా2లో...

# రాష్ట్రంలో 12 కొవిడ్ కేసులు

- నాలుగు జిల్లాల్లో చెదురుమొదురుగా నమోదు
- పూణే ల్యాబ్‌కు జన్యుక్రమ విశ్లేషణ నిమిత్తం 5 నమూనాలు
- జులై ఒకటి నుంచి దేశవ్యాప్తంగా 339 కోవిడ్ కేసుల నమోదు



**అమరావతి,మన జనప్రగతి జూలై 17:** రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్‌లో కరోనా మహమ్మారి మళ్లీ కలకలం రేపుతోంది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కొత్తగా కోవిడ్-19 పాజిటివ్ కేసులు నమోదవడంతో ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. తక్షణమే అప్రమత్తంగా ఉండాలని జిల్లా అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేసింది.వివరాల్లోకి వెళితే, జూన్ 26వ తేదీ నుంచి జులై 16 వరకు మిగతా2లో...



## మాది ఇన్వెస్టర్ల
# ఫ్రెండీ ప్రభుత్వం

- రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత

**అమరావతి,మన జనప్రగతి జూలై 17:** భారత్ టెక్స్ -2026 ఈవెంట్ లో పాల్గొనడానికి ఢిల్లీ వెళ్లిన రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత మొదటి రోజు బిజీగా గడిపారు. పలువురు జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారులు, కొనుగోలుదారులతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడుల రాకకు, పరిశ్రమల స్థాపనకు తమ ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోందని, ఇన్వెస్టర్లకు ఫ్రెండీ ప్రభుత్వమని తెలిపారు. ప్రభుత్వం తరఫున అన్ని విధాలా అండగా ఉంటామంటూ, ఏపీలో పెట్టుబడులు పెట్టాలని మంత్రి సవిత కోరారు. ఈ సందర్భంగా చేనేత వస్త్రాల కొనుగోలుకు సంబంధించి పలు ఆర్డర్లు సైతం చేనేత, జౌళి శాఖకు వచ్చాయి. ఈ నెల 14 నుంచి కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అతిపెద్ద అంతర్జాతీయ టెక్స్‌టైల్ ప్రదర్శన భారత్ టెక్స్ -2026 ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ టెక్స్ ఈవెంట్లో రాష్ట్రానికి చెందిన టెక్స్ టైల్స్ ఉత్పత్తుల అమ్మకాలే లక్ష్యంగా మంత్రి సవిత రెండ్రోజుల పర్యటనకు మిగతా2లో...

## రాష్ట్ర సమస్యలపై పార్లమెంటులో
# ప్రస్తావించండి

- నిధులను రాబట్టేందుకు యత్నించండి
- పార్టీ ఎంపిలకు చంద్రబాబు దిశానిర్దేశం



**అమరావతి,మన జనప్రగతి జూలై 17:** తెదేపా అధినేత, సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఆ పార్టీ పార్లమెంటరీ భేటీ జరిగింది. ఈనెల 20 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహంపై ఎంపీలతో సీఎం మిగతా2లో...

## 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల
# ఏర్పాట్లపై సిఎస్ సమీక్ష



**అమరావతి,మన జనప్రగతి జూలై 17:** ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై శుక్రవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు.రానున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పటిష్ట నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై మిగతా2లో...

మనజనప్రగతి



# రాష్ట్రాభివృద్ధిలో బ్యాంకులు భాగస్వామ్యం కావాలి

(మొదటి పేజీ తరువాయి)

వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి రాష్ట్రానికి తిప్పలు తెచ్చిందని, కూటమి అధికారంలోకి వచ్చాకే ఆ రుణాల్ని కేంద్ర సహకారంతో రీ -షెడ్యూలు చేసి రూ.1,538 కోట్లు ఆదా చేశామని అన్నారు. పలనాడు జిల్లా నరసరావుపేటలో కేంద్ర ఆర్థిక శాఖ, ప్రభుత్వ రంగ బ్యాంకులు సంయుక్తంగా నిర్వహించిన మెగా రుణమేళా కార్యక్రమానికి (క్రెడిట్ అవుట్ రీచ్) కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి ముఖ్యమంత్రి పాల్గొన్నారు. పలనాడు జిల్లాలో 1,03,246 మంది లబ్ధిదారులకు రూ.3,216 కోట్ల రుణాలను అందజేశారు. ఇందులో భాగంగా 15 వేల మంది డ్వాక్రా మహిళలకు,13,355 మంది పారిశ్రామికవేత్తలకు రుణాలు పంపిణీ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ "పారిశ్రామికవేత్తలుగా మారడానికి పల్నాడు చిరునామా కావాలి. పలనాడు పౌరుషానికి శక్తివంతమైన ఆయుధం ఇస్తున్నాం. క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమం నిర్వహిస్తున్న అందరికీ అభినందనలు. రైతులు, విద్యార్థులు, డ్వాక్రా సంఘాల మహిళలు ఇలా అర్హులైన వారందరికీ రుణం అందించటమే లక్ష్యం. మహిళా సాధికారతకు ఈ క్రెడిట్ అవుట్ రీచ్ ద్వారా ప్రయోజనాలు చేకూరతాయి. రెండేళ్ల క్రితం రాష్ట్రం అంతా సమస్యల సుడిగుండంలో ఉంది. ఏపీలో ఆర్థిక విధ్వంసం చేశారు. కేంద్ర సహకారంతో అమరావతి, పోలవరం, విశాఖ ఉక్కు ఆకాంక్షలు నెరవేరాయి. వీబీజీ రామ్ జీ కింద కేంద్రం నుంచి రూ.7,707 కోట్లు రాష్ట్రానికి వస్తుంది. రాయలసీమను హార్టీ కల్చర్ హబ్ గా మార్చేందుకు కేంద్రం రూ.40 వేల కోట్లు ఆర్థిక సహకారం అందిస్తుంది.ప్రైవేటు పెట్టుబడులతో కలిపి ఈ ప్రాంతాన్ని ఉద్యాన హబ్ గా మారుస్తాం." అని సీఎం వివరించారు."మహిళలందరికీ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదర్శంగా నిలుస్తున్నారు. 10 లక్షల డ్వాక్రా సంఘాలు రూ.29 వేల కోట్ల పొదుపుతో దేశంలోనే మేటిగా నిలిచాయి. రుణాల రీ పేమెంట్ లో 99.5 శాతంతో డ్వాక్రా మహిళలు అగ్రస్థానంలో ఉన్నారు. వారందరినీ మహిళా వ్యాపారవేత్తలుగా మార్చేందుకు వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ కార్యక్రమం చేపట్టాం. బ్యాంకింగ్ లో నిర్మలా సీతా రామన్ చాలా సంస్కరణలు తీసుకొచ్చారు. నష్టాల్లో ఉన్న చిన్న బ్యాంకులను విలీనం చేసి సమర్థ బ్యాంకింగ్ వ్యవస్థకు దోహదం చేశారు. డిజిటల్ బ్యాంకింగ్ విప్లవం, జన్ ధన్ యోజన ద్వారా కోట్లాది బ్యాంకు ఖాతాలు, జీఎస్టీ శ్లాబ్ లను కుదించి పారదర్శక విధానం తెచ్చారు. వికసిత్ భారత్ 2047కు అనుగుణంగా చాలా సంస్కరణలు కేంద్ర మంత్రి నిర్మల తీసుకొచ్చారు. ఈ తరహా క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమాల్ని 6 జిల్లాల్లో నిర్వహించేందు కు తక్షణమే అంగీకరించారు. త్వరలోనే 3 నెలలకు ఒకటి చొప్పున ఈ తరహా కార్యక్రమాలు చేపడతాం." అని ముఖ్యమంత్రి అన్నారుదేశంలోని ప్రతి గ్రామంలోనూ బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉండాలన్నదే ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పమని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. తాను ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టే సమయానికి బ్యాంకులు ఎన్‌పీఏల సమస్యలతో ఇబ్బందుల్లో ఉండేవని, చిన్న వ్యాపారులు అప్పులు దొరక్క నష్టపోయేవారని గుర్తుచేశారు. చిన్న వ్యాపారుల ఆర్థిక కష్టాలను గుర్తించిన ప్రధాని మోదీ.. ప్రభుత్వమే గ్యారెంటీ ఇచ్చి బ్యాంకుల ద్వారా వారికి సులభంగా రుణాలు అందేలా పథకాలు తెచ్చారని వివరించారు. నేడు బ్యాంకులు స్వయంగా వ్యాపారుల చెంతకే వచ్చి రుణాలు ఇస్తున్నాయని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. మెగా రుణమేళాలో భాగంగా లబ్దిదారులకు ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి రుణ మంజూరు పత్రాలను, చెక్కులను అందజేశారు. ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ అందజేతయూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.42.16 లక్షల విలువైన అంబులెన్స్‌ను పిడుగురాళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి అందించారు. అలాగే నాబార్డు సౌజన్యంతో డీసీసీబీకి రూ.25 లక్షల విలువైన 2 మొబైల్ డెమో వ్యాన్లు అందించారు. అలాగే విద్యార్థినులకు రూ.17.80 లక్షల విలువైన 301 సైకిళ్లను పంపిణీ చేశారు. పర్యాటక శాఖకు గ్రామీణ బ్యాంక్ తరపున రూ.14 లక్షల విలువైన 2 బ్యాటరీ వాహనాలను అందించారు. వీటిని సీఎం చంద్రబాబు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం దివ్యాంగులకు ఉచితంగా ట్రై సైకిళ్ల పంపిణీ చేశారు.

# అడవి ఏనుగు పట్టివేత

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఏనుగును వన్యప్రాణి సంరక్షణ చట్టాలకు లోబడి, పశు వైద్య నిపుణులు, అటవీశాఖ ఫీల్డ్ సిబ్బంది పర్యవేక్షణలో బంధించారు. బుధవారం నిర్వహించిన తుది ఆపరేషన్లో ముసలమడుగు క్యాంపు నుంచి వచ్చిన ఐదు కుంకీ ఏనుగులు కూడా పాల్గొని, ఏనుగుని బంధించడంలో కీలకపాత్ర పోషించాయి. గతంలో ఈ ఏనుగు దాడిలో గాయపడిన అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ శ్రీ సుకుమార్ కూడా ఈ ఆపరేషన్ లో పాల్గొనడం గమనార్హం. అత్యంత చాకచక్యంగా ఆపరేషన్ నిర్వహించి విజయవంతంగా పూర్తి చేసిన పీసీసీఎఫ్ శ్రీ పి.వి.చలపతిరావు, అటవీశాఖ సిబ్బందిని, అనంతపురం సర్కిల్ కన్జర్వేటర్ శ్రీమతి యశో దా బాయ్, చిత్తూరు జిల్లా అటవీ అధికారితో పాటు పశువైద్య నిపుణులు, ట్రాకర్లు, మహౌత్ లను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ అభినందించారు. గతంలో ఏనుగు దాడిలో గాయపడినప్పటికీ, కోలుకుని ఈ ఆపరేషన్లో పాల్గొన్న శ్రీ సుకుమార్ ధైర్య సాహసాలను మెచ్చుకున్నారు. ప్రజల భద్రత, వన్యప్రాణి సంరక్షణకు సమాన ప్రాధాన్యత ఇస్తూ అటవీశాఖ చేపట్టిన ఆపరేషన్ ను ప్రశంసించారు. పట్టుకున్న ఈ ఏనుగును ముసలమ డుగు క్యాంపుకి తరలిస్తున్నట్టు అటవీశాఖ అధికారులు తెలుపగా, కుంకీగా శిక్షణ ఇచ్చేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని శ్రీ పవన్ కళ్యాణ్ గారు సూచించారు.ఈ ఏనుగు పలమనేరు సమీప ప్రాంతాల్లో సంచరిస్తూ పదే పదే పంటలను ధ్వంసం చేయడంతోపాటు పరిసర గ్రామాల ప్రజలను భయ భ్రాంతులకు గురి చేసింది. పలుమార్లు జనావాసాల మధ్యకు రాగా, గతంలో చేపట్టిన మళ్లింపు చర్యల్లో పలమనేరు అటవీ విభాగానికి చెందిన ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శ్రీ సుకుమార్ పై దాడి చేసి, తీవ్రంగా గాయపర్చింది. పంటలకు నష్టం కలిగించడం, ప్రజల భద్రత దృష్ట్యా ఈ ఒంటరి మగ ఏనుగును బంధిం చాల్సి వచ్చింది. అందుకోసం సుదీర్ఘకాలం ఏనుగు కదలికలను క్షేత్ర స్థాయి అటవీ సిబ్బంది, ట్రాకర్ల సాయంతో పర్యవేక్షించారు. అప్పట్లో అటవీశాఖ సిబ్బందిపై దాడి చేసినా తర్వాత ఏనుగు ప్రవర్తనలో మార్పు రావడాన్ని గుర్తించారు. అధునాతన డ్రోన్లు, థర్మల్ సెన్సార్ కెమెరాల సాయంతో నెల రోజులుగా ఏనుగు కదలికలను ట్రాక్ చేశారు. గతంలో ఏనుగు దాడి చేసిన సెక్షన్ లోనే జాతీయ రహదారికి సమీపంలో పట్టుకున్నారు.వన్యప్రాణి నిర్వహణ నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ, పీసీసీఎఫ్ పర్యవేక్షణలో ఈ ఆపరేషన్ నిర్వహించారు. ఏనుగుకు మత్తుమందు ఇచ్చే ప్రక్రియను డాక్టర్ నవీన్, అరుణ్ లు సమన్వయం చేయగా, విశ్రాంత ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీ రఘునాథ్ ఆపరేషన్ అనంతర కార్యక్రమాల నిర్వహణను పర్యవేక్షించారు. అనంత సర్కిల్ కన్జర్వేటర్ ఆపరేషన్ ను స్వయంగా పర్యవేక్షిస్తూ కీలక సూచనలు ఇచ్చారు. ఉపముఖ్యమంత్రివర్యుల సూచన మేరకు పట్టుకున్న ఏనుగును ముసలమడుగు కుంకీ శిబిరానికి తరలించారు. అక్కడ పశువైద్య పరీక్షలు పూర్తి చేసిన అనంతరం, ఏనుగు ప్రవర్తనను కొంతకాలం పర్యవేక్షిస్తారు. మనుషులతో మెలిగే అంశంలో సానుకూల దృక్పథం కనబరిస్తే ప్రత్యేక శిక్షణ ఇచ్చి కుంకీగా తీర్చిదిద్దుతారు.

# మాది ఇన్వెస్టర్ల ఫ్రెండీ ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

గురువారం ఢిల్లీ చేరుకున్నారు. మొదటి రోజు పలువురు జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారులు, కొనుగోలుదారులతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో ప్రపంచ ప్రఖ్యాత గాంచిన వివిధ ప్రాంతాల చేనేత వస్త్రాల ప్రాముఖ్యత తో పాటు ఆయా వస్త్రాల తయారీలో కలంకారీ నైపుణ్యం వినియోగంపైనా వారికి వివరించారు. ముఖ్యంగా రాష్ట్రంలో పెట్టుబడుల స్థాపనకు సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత వివరించారు. దేశంలోకి వస్తున్న పెట్టుబడుల్లో 25 శాతానికి పైగా ఏపీకే తరలొస్తున్నాయన్నారు. పెట్టుబడిదారుల్లో విశ్వాసం నెలకొల్పేలా సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ అండగా ఉంటున్నారన్నారు. తమది ఇన్వెస్టర్లకు ఫ్రెండ్లీ ప్రభుత్వమని మంత్రి సవిత స్పష్టంచేశారు. భారత్ టెక్స్ 2026లో ఏర్పాటు చేసిన ఏపీ పెవిలియన్ కు విశేష స్పందన లభిస్తోంది. రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు చెందిన చేనేత ఉత్పత్తుల కొనుగోలుకు పలువురు జాతీయ, అంతర్జాతీయ కొనుగోలుదారులు ఆసక్తి చూపారు. ముఖ్యంగా చేనేత వస్త్రాలపై కలంకారీ చీరలు, ఇతర ఉత్పత్తులు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. **మంత్రి సవిత వరుస భేటీలు** భారతదేశ అతిపెద్ద అంతర్జాతీయ టెక్స్‌టైల్ ప్రదర్శనకు విచ్చేసిన మంత్రి సవిత పలువురు పెట్టుబడిదారులు, కొనుగోలుదారులతో భేటీ అయ్యారు. అరవింద్ ఫ్యాబ్రిక్ సీఈవో డాక్టర్ పరమ్ షా, భారత్ టెక్స్ 2026 ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ నరేన్ గోయెంకాతో పలు అంశాలపై చర్చించారు. వారితో పలువురు విదేశీ కొనుగోలుదారులతోనూ చర్చలు జరిపారు. రెండోరోజు శుక్రవారం కూడా మంత్రి సవిత భారత్ టెక్స్ ఈవెంట్ లో పాల్గొనబోతున్నారు. సాయంత్రం ఢిల్లీలో ఆధునీకరించిన లేపాక్షి షో రూమ్ ను మంత్రి సవిత ప్రారంభించనున్నారు. అంతకు ముందు ఢిల్లీ పర్యటనకు వచ్చిన మంత్రి సవితకు కేంద్ర హ్యాండ్లూమ్ ఎక్స్ పోర్ట్ ప్రోమోషనల్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎన్.శ్రీధర్, ఏపీహెచ్డీసీ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరి ప్రసాదరావు, రాష్ట్ర చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి, ఇతర అధికారులు ఘన స్వాగత పలికారు.

# రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేసిన వైసిపి

## మోడీ ఆశిస్సులు, నిర్మలా సీతారామన్ సహకారంతో గట్టెక్కాం

## బ్యాంకుల క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమంలో మంత్రి పయ్యావుల కేశవ్

**పల్నాడు,మన జనప్రగతి జూలై 17:** రాజకీయాల కోసం ఈ ప్రాంతంలో వైషమ్యాలు పెంచిన వాళ్లను గతంలో చూశామని ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. ప్రజలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ఒకే రోజున రూ.3 వేల కోట్లను కూటమి ప్రభుత్వం అందించిందని తెలిపారు. శుక్రవారం నరసరావుపేటలో వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకుల క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. సిఎం చంద్రబాబుతో పాటు, కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థను వైసీపీ అస్తవ్యస్తం చేసిందని విమర్శించారు. కూటమి వచ్చిన రోజున ఏ పని చేయాలన్నా ఖజానాలో డబ్బు లేని పరిస్థితి ఉండేదని అన్నారు. ప్రధాని మోదీ ఆశీస్సులు, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ఆలోచనలతో ఏపీ ఇప్పుడు అభివృద్ధి దిశగా పరుగులు పెడుతోందన్నారు. ఒక మహిళ ఇంటిని ఎలా తీర్చిదిద్దుతుందో అంతకంటే మెరుగ్గా నిర్మలా సీతారామన్ పని చేస్తున్నారని కొనియాడారు. '2024లో మీరు వేసిన ఒక్క ఓటు వల్లే అమరావతి, పోలవరం, విశాఖ ఉక్కు, తల్లికి వందనం, ఉచిత బస్సు, గూగుల్ వంటి కంపెనీలు రాక సాధ్యమైంది' అని చెప్పుకొచ్చారు. ఏపీకి ఏ కష్టం వచ్చినా నిర్మలా సీతారామన్ గుమ్మం తలుపు తట్టి సాయం అడుగుతున్నామన్నారు. రాష్ట్రం కోసం ఏం అడిగినా కాదనకుండా పని చేస్తున్నారని తెలిపారు. విశాఖలో ఉక్కు పరిశ్రమ పరిరక్షణకు నిర్మలమ్మ చూపిన చొరవకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్డీయే ప్రభుత్వం రేయింబవల్లు రాష్ట్రం కోసం పని చేస్తోందని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ప్రతి గ్రామానికి కేంద్ర పథకాలు చేరాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్ష అని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. మహిళలు, యువత, వ్యాపారాలకు భారీగా రుణాలు ఇస్తున్నామన్నారు. మొదటిసారిగా ట్రాన్స్‌జెండర్లకు బ్యాంకు రుణాలు అందించామని తెలిపారు. అటవి సాగుహక్కు పట్టాలు పొందిన గిరిజనులకు కూడా రుణాలు అందిస్తున్నామని చెప్పారు. బ్యాంకుల్లో ఉన్న డ్వాక్రా సంఘాల డిపాజిట్లకు వడ్డీ చెల్లించాలని.. డ్వాక్రా సంఘాల వారితో 25 మండలాల్లో 25 మెగావాట్ల సౌరవిద్యుత్తు ప్లాంట్లు ఏర్పాటుకు సహకరించాలని కేంద్ర మంత్రిని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు.



# భారతీయ రైల్వే చరిత్రలో మరో మైలురాయి

(మొదటి పేజీ తరువాయి)

నిదర్శమని కొనియాడారు.ఇదిబొగ్గు, డీజిల్ అవసరం లేకుండా కేవలం హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ టెక్నాలజీతో నడుస్తుంది. ఇది రైలును ముందుకు నడపటానికి హైడ్రోజన్‌ను విద్యుత్తుగా మారుస్తుంది. ఈ ప్రక్రియలో ఉప ఉత్పత్తిగా కేవలం నీటి ఆవిరి మాత్రమే వెలువడుతుంది. దీనివల్ల రైలు నడుస్తున్నప్పుడు కార్బన్ ఉద్గారాలు సున్నాగా ఉంటాయి.పర్యావరణహితంగా 'నమో గ్రీన్‌రైలు' పేరుతో నడిచే ఈ రైలుకు 10 కోచ్‌లు, 3200 హెచ్‌పీ ఇంజిన్ ఉన్నాయి. ఈ రైలు సుమారు గంటకు 110 కి.మీ వేగంతో ప్రయాణిస్తుంది. ఈ రైలులో దాదాపు 2600 మంది ప్రయాణికులు ప్రయాణం చేయవచ్చు. ఈ రైలును చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ నిర్మించింది. దీంతో హైడ్రోజన్ ఆధారిత రైళ్లను నడుపుతున్న ప్రపంచంలో అతికొద్ది దేశాల సరసన భారత్ నిలిచింది.ప్రపంచంలో మొట్టమొదటి హైడ్రోజన్ రైలు జర్మనీలో నడిపారు. ఆ తరువాత జపాన్, చైనా, యూఎస్‌లలో కూడా హైడ్రోజన్ రైళ్లను ప్రారంభించారు.

# అమృత్ పథకంలో మంగళగిరి స్టేషన్ ఆధునీకరణ

(మొదటి పేజీ తరువాయి)

కింద సరికొత్త హంగులతో మంగళగిరి రైల్వేస్టేషన్‌ను పునర్వ్యవస్థీకరించారు. రూ.12.56 కోట్ల భారీ వ్యయంతో ఆధునికీకరణ చేశారు. శుక్రవారం ఈ స్టేషన్‌ను ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి లోకేశ్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడారు. దేశ ఆర్థిక, సామాజిక ప్రగతిలో రైల్వేశాఖ కీలకపాత్ర పోషిస్తోంది. దేశాన్ని ఏకం చేసే ఏకైక అతిపెద్ద సంస్థ రైల్వే మాత్రమే. గతంలో రైల్వే వ్యవస్థలో తీవ్ర ఆలస్యాలు, భద్రతా లోపాలు ఉండేవి. కానీ నేడు ప్రధాని మోదీ ఆధ్వర్యంలో 'కవచ్' ఆటోమేటిక్ ప్రొటెక్షన్ వంటి అత్యాధునిక సిస్టమ్స్‌తో దేశంలో అపూర్వమైన రైల్వే విప్లవం నడుస్తోంది. మంగళగిరి నియోజకవర్గానికి రైల్వే పరంగా మరింత ప్రాధాన్యత ఇవ్వాలి. ఇక్కడ మరిన్ని రైళ్లు ఆగేలా కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చొరవ చూపాలని కోరుతున్నా. మంగళగిరిలోని ప్రముఖ పుణ్యక్షేత్రం లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం అభివృద్ధికి ప్రత్యేక పథకం తీసుకురావాల్సిన అవసరముంది. ఒక ఎంపీ, ఒక ఎమ్మెల్యే కలిసికట్టుగా పనిచేస్తే నియోజకవర్గ అభివృద్ధి ఎలా ఉంటుందో చూపించడానికి నేడు మంగళగిరి ఒక అద్భుతమైన ఉదాహరణగా నిలిచింది. ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులు చూడాలని సీఎం చంద్రబాబే స్వయంగా కుప్పం నేతలకు చెప్పారు. రాజధాని అమరావతిని అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ ధ్యేయం. దీనికోసం రైల్వే, రోడ్డు, ఎయిర్ లైన్ రవాణా వ్యవస్థల అనుసంధానం ఎంతో అవసరం. రాష్ట్రాన్ని పారిశ్రామికంగా, సాంకేతికంగా వేగంగా అభివృద్ధి చేస్తున్నాం. నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం పక్క రాష్ట్రాల వైపు చూడాల్సిన అవసరం లేకుండా చేస్తాం' అని లోకేశ్ అన్నారు.

# రాష్ట్రంలో 12 కొవిడ్ కేసులు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో మొత్తం 12 కరోనా పాజిటివ్ కేసులు వెలుగు చూశాయి. ఈ కేసులను కడప, విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు జిల్లాల్లో గుర్తించారు. ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, ఈ కేసుల్లో నలుగురు మరణించినట్లు ఆరోగ్య శాఖ వర్గాలు ధ్రువీకరించాయి. మిగిలిన బాధితుల్లో ముగ్గురు ప్రస్తుతం హోం ఐసోలేషన్‌లో ఉండగా, ఇతరులు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు.ఈ పరిణామాల నేపథ్యంలో ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. కరోనా లక్షణాలు కనిపించిన వారికి వెంటనే పరీక్షలు నిర్వహించాలని జిల్లా వైద్యాధికారులను ఆదేశించింది. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, టెస్టింగ్ కిట్లు, ఆక్సిజన్ నిల్వలను సిద్ధంగా ఉంచుకోవాలని స్పష్టమైన సూచనలు ఇచ్చింది. ప్రస్తుతానికి కేసుల సంఖ్య తక్కువగానే ఉన్నప్పటికీ, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ఏమాత్రం నిర్లక్ష్యం చేయవద్దని అధికారులు సూచిస్తున్నారు. పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నట్లు తెలిపారు.

# 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సిఎస్ సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

సంబంధిత శాఖల అధికారులకు సిఎస్ ఆదేశాలు జారీ చేశారు.రాజధాని ప్రాంతంలోని ప్రస్తుత పెరేడ్ గ్రౌండ్ లో నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.ఈసమావేశంలో జిఏడి ముఖ్య కార్యదర్శి జె.శ్యామల రావు, ఎంఏయుడి ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్,ఐజి రాజ కుమారి, డైరెక్టర్ ఐఅండ్పిఆర్ కె.ఎస్. విశ్వనాథన్, అమరావతి డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్ పర్సన్ లక్ష్మీ పార్థ సారథి,గుంటూరు జిల్లా కలెక్టర్,ఎస్పి ఇతర అధికారులు పాల్గొన్నారు.వర్చువల్ గా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


# రాష్ట్ర సమస్యలపై పార్లమెంటులో ప్రస్తావించండి

(మొదటి పేజీ తరువాయి)

చర్చించారు. వివిధ అంశాలపై వారికి దిశానిర్దేశం చేశారు. పోలవరం ప్రాజెక్టు పురోగతి, కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, నిర్వాసితుల పునరావాస కార్యక్రమాలు, రాజధాని నిర్మాణ పనులు, మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడుల ఆకర్షణపై చంద్రబాబు సూచనలు చేశారు. రాయలసీమకు సాగునీటిని అందించేందుకు చేపట్టాల్సిన గోదావరి–పెన్నా అనుసంధాన పక్రియ, కార్యాచరణపై సీఎం దిశానిర్దేశం చేశారు. దక్షిణ కోస్తా రైల్వేజోన్‌కు సంబంధించిన మౌలిక సదుపాయాలు, రైల్వే భూముల కేటాయింపు, జోన్ పూర్తిస్థాయి కార్యకలాపాల ప్రారంభం అంశాలపై చర్చించారు. పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రవేశపెట్టే వివిధ చట్ట సవరణలు, కొత్త బిల్లుల పట్ల పార్టీ అనుసరించాల్సిన విధానంపై సమావేశంలో చర్చ జరిగింది. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా బిల్లు, ఎస్ఐఆర్ అంశాలపై నేతలతో సీఎం చర్చించారు. సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న దుష్ప్రచారం, ఫేక్ న్యూస్ కట్టడి, వ్యవస్థలపై జరుగుతున్న దాడుల అంశాల్లో పార్లమెంట్ వేదికగా లేవనెత్తే విషయంపై చంద్రబాబు పలు సూచనలు చేశారు. ఎంపీలు తమ నియోజకవర్గాల సమస్యలు, కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అంశాలపై చర్చించారు.

# గ్రేడ్-2 బీసీ హాస్టల్ వార్డెన్లకు శుభవార్త

● పదోన్నతుల సర్వీస్ రూల్స్ సడలిస్తూ ఉత్తర్వులు



**అమరావతి,మన జనప్రగతి జూలై 17:** గ్రేడ్–2 బీసీ హాస్టల్ వార్డెన్లకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. పదోన్నతుల కల్పనకు సర్వీస్ రూల్స్‌ను సడలిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని 300 మందికి పైగా గ్రేడ్–2 హాస్టల్ వార్డెన్లు పదోన్నతులు పొందే అవకాశం ఉంది. గత కొంతకాలంగా సర్వీస్ రూల్స్ సడలించాలని గ్రేడ్–2 హాస్టల్ వార్డెన్లు ప్రభుత్వాన్ని కోరుతున్న విషయం తెలిసిందే. 2008 నుంచి ఈ అంశంపై వార్డెన్లు సర్కార్‌కు విజ్ఞప్తులు చేస్తూ వస్తున్నారు. తాజాగా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో గ్రేడ్ 2 హాస్టల్ వార్డెన్లకు ఉపశమనం లభించినట్లైంది. ఈ సందర్భంగా తమ సమస్య పరిష్కారానికి కృషి చేసిన మంత్రి సవితకు గ్రేడ్–2 హాస్టల్ వార్డెన్లు ధన్యవాదాలు తెలియజేశారు. కూటమి ప్రభుత్వ నిర్ణయంతో వార్డెన్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# జూలై 25న ఆస్పరిలో సీఎం పర్యటన

- పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలి: కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి
- హెలిప్యాడ్, సభా వేదిక,పార్కింగ్ ప్రాంతాల పరిశీలన
- ట్రాఫిక్, భద్రత, ప్రజా సౌకర్యాలపై అధికారులకు ఆదేశాలు



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూలై 17:-**ఈ నెల 25న ఆస్పరి మండల కేంద్రంలో నిర్వహించనున్న "సంజీవని" కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరుకానున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆస్పరిలో ఏర్పాటు చేయనున్న హెలిప్యాడ్, బహిరంగ సభ ప్రాంగణం, పార్టీ క్యాడర్ సమావేశ స్థలం,పార్కింగ్ ప్రాంతాలు, ప్రధాన రహదారులను సంబంధిత అధికా రులతో కలిసి పరిశీలించిన కలెక్టర్, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా అన్ని పనులను గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. సభకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగ కుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని, వాహనాల రాకపోకలకు అనువుగా ప్రత్యేక పార్కింగ్ స్థలాలు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందస్తు కార్యాచరణ చేపట్టి, అవసరమైన చోట్ల ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేయాలని, ప్రజలకు ముందుగానే సమాచారం అందించాలని పోలీసు అధికారులకు సూచించారు. హెలిప్యాడ్, సభా ప్రాంగణం, పార్కింగ్ ప్రాంతాలకు వెళ్లే రహదారులను పరిశీలించిన కలెక్టర్, అవసరమైన మరమ్మ తులను కార్యక్రమానికి ముందే పూర్తి చేయాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. ఈ పరిశీలనలో జాయి ంట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా, ఆర్డీవో చిన్న ఓబులేసు, ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పద్మనాభరెడ్డి, జిల్లా టీడీపీ అధ్యక్షులు గుడిసె కృష్ణమ్మ, ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి చేత 'సంజీవని' ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

- ఆస్పరి పీహెచ్‌సీని పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి



**కర్నూలు బ్యూరో ఆస్పరి జూలై 17:-**ఈ నెల 25న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆస్పరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 'సంజీవని' కార్యక్రమాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి శుక్రవారం పీహెచ్‌సీని సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు. కార్యక్రమ నిర్వహణ, వైద్య సేవలు, మౌలిక వసతులు, పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సాధారణ ప్రసవాలు అధికంగా జరుగుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆస్పరి కేంద్రం ఒకటిగా నిలవడం అభినందనీయమన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు వైద్య సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. ఆసుపత్రిలో ప్రతిరోజూ నమోదవుతున్న ఓపీ, నెలవారీ ప్రసవాలు, అందిస్తున్న వైద్య సేవల వివరాలను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రక్త పరీక్షల గది, సంజీవని అరినా కేంద్రం, మెడికల్ ఆఫీసర్ గది, ఫార్మసీ, ఆరోగ్య మిత్ర హెల్ప్‌డెస్క్, ప్రసూతి వార్డు, ఇతర వార్డులు, ఆసుపత్రి ప్రాంగణాన్ని పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన దృష్ట్యా మరమ్మత్తులు, పరిశుభ్రత, విద్యుత్, తాగునీరు, సూచిక బోర్డులు తదితర ఏర్పాట్లను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పర్యటన విజయవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. **రోగులతో మాట్లాడిన కలెక్టర్** పీహెచ్‌సీకి చికిత్స కోసం వచ్చిన రోగులతో కలెక్టర్ మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రిలోనే మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని, పరీక్షలు లేదా మందుల కోసం బయటకు పంపడం లేదని రోగులు చెప్పడంతో కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

# కడపలో చలగాటమాడుతున్న కరోనా

- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- వైసిపి జిల్లా అధికార ప్రతినిధి పి.జయచంద్రారెడ్డి




**కడప మన జనప్రగతి జులై 17:-**రాష్ట్రంలో కరోనా రోజురోజుకు చెలగాటమాడుతుందని నిత్యం కేసులు పెరుగుతున్నాయి. కానీ కూటమి ప్రభుత్వం పట్టించుకున్న పాపానా పోలేదని వైయస్సార్ జిల్లా అధికార ప్రతినిధి జయ చంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం ఈ సందర్భంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆంధ్రప్రదేశ్ లో వైద్య వ్యవస్థ అనేది భ్రష్టు పట్టిపోయిందని తెలిపిందన్నారు. అందులో భాగంగా కడప లో కరోనా చెలగాటమాడుతుంటే జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ అధికారి గాని జిల్లా అధికార యంత్రాంగం గాని కరోనా పై ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు.తెలంగాణలో 10 లక్షల జనాభా కు 144 మెడికల్ సీట్లు ఉంటే ఆంధ్రప్రదేశ్లో 10 లక్షల జనాభాకు 66 మెడికల్ చిట్లే ఉన్నాయన్నారు. దీనివలన ఆంధ్రప్రదేశ్లో కరోనా రోజు రోజు పెరుగుతుందన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒకటి కూడా నెరవేర్చలేదు. కొత్త పింఛన్లు గాని కొత్త ఇల్లు కానీ ఇవ్వలేదు. ప్రతిపక్షాలను కక్ష సాధింపు చర్యలకు చేస్తున్నారు తప్ప ప్రజలకు సేవ చేయడానికి జిల్లా అధికార యంత్రం గాని ఉపయోగించలేదని మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, లోకేష్ కమిషన్ల కోసం పనులు చేస్తున్నారే తప్ప ప్రజలకు సేవ చేయలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మున్సిపల్ సంయుక్త కార్యదర్శి నిరంజన్ రెడ్డి, తేజ తదితరులు పాల్గొన్నారు.

# కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలి

**బిలేకల్ జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి**





**ఆస్పరి మన జనప్రగతి జూలై 17:-**విద్యార్థులు చిన్ననాటి నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థానాలను చేరుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆస్పరి మండలం బిలేకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన ఆమె విద్యా బోధన, మధ్యాహ్న భోజన పథకం, తాగునీరు, పారిశుద్ధ్యం, మౌలిక వసతులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న అన్ని సౌకర్యాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. యూనిఫామ్‌లను మరో రెండు రోజుల్లో పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, పోషకాహారం తీసుకోవడం ద్వారా మంచి ఆరోగ్యం, విద్యలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని సూచించారు. విద్యార్థుల చదువు, స్లిప్ టెస్టులు, పాఠ్యపుస్తకాలపై ఆరా తీసిన కలెక్టర్, ప్రతి పరీక్షను అవకాశంగా తీసుకొని అన్ని సబ్జెక్టులపై పట్టు సాధించాలని సూచించారు. తాగునీరు, మరుగుదొడ్ల సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. **జూలై 24 మెగా పేరెంట్స్-డేకు తల్లిదండ్రులను తప్పనిసరిగా ఆహ్వానించాలి** మెగా పేరెంట్స్-డేకు ప్రతి విద్యార్థి తన తల్లిదండ్రులను స్వయంగా ఆహ్వానించాలని కలెక్టర్ సూచించారు. లీప్ యాప్ ద్వారా పిల్లల హాజరు, చదువు, విద్యా పురోగతిని తల్లిదండ్రులు పరిశీలించాలని తెలిపారు. మొక్కలు నాటి సంరక్షించాలని, సోషల్ మీడియాకు దూరంగా ఉండి చదువుపై దృష్టి పెట్టాలని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. బాలికలు ఉన్నత విద్యను లక్ష్యంగా పెట్టుకోవాలని, పాఠశాలకు అవసరమైన నాలుగు అదనపు తరగతి గదుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, ఆర్డీవో చిన్న ఓబులేసు, తహసీల్దార్ మల్లికార్జున రెడ్డి, ఎంపీడీవో గీతావాణి, ఎంఈవో తిరుమలరావు, ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# మైనర్ బాలిక భవిష్యత్తును కాపాడిన ఆదోని శక్తీ టీం పోలీస్‌లకు అభినందన

**పిల్లల హక్కుల పరిరక్షణ,బాల్య వివాహాల నివారణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత**

**కర్నూలు జిల్లా ఎస్.పీ విక్రాంత్ పాటిల్**



**కర్నూలు బ్యూరో ఆదోని మన జనప్రగతి జులై 17:-** బాల్య వివాహాన్ని అడ్డుకుని ఓ మైనర్ బాలిక భవిష్యత్తును కాపాడడంలో కృషి చేసిన ఆదోని కి చెందిన శక్తి బృందం పోలీసు కానిస్టేబుల్ లు కె. రాజేశ్వరి, ఎస్. వీరాంజనేయుల ను జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ఇటీవల ఆదోని మండలం ఇస్వి గ్రామానికి చెందిన 8వ తరగతి చదువుతున్న మైనర్ బాలికకు బాల్య వివాహం జరిపేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం అందడంతో, ఆదోని కి చెందిన శక్తి బృందం పోలీసు కానిస్టేబుల్ లు కె.రాజేశ్వరి,ఎస్. వీరాంజనేయులు వెంటనే స్పందించి ఐసీడీఎస్, రెవెన్యూ, ఆరోగ్య శాఖ, గ్రామ సచివాలయ అధికారులతో సమన్వయం చేసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అనంతరం బాలిక కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. బాల్య వివాహం చట్టరీత్యా నేరమని, దీనివల్ల బాలిక విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై తీవ్ర ప్రతికూల ప్రభావాలు ఉంటాయని వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ..పిల్లల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాల నివారణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. పోలీసులు అవగాహన చేయడంతో కుటుంబ సభ్యులు బాల్య వివాహాన్ని విరమించుకోవడంతో ఒక మైనర్ బాలిక భవిష్యత్తు ను కాపాడడం జరిగిందన్నారు. ఇటువంటి ఘటనలపై పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు కూడా ఎక్కడైనా బాల్య వివాహాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 112 కు గాని లేదా చైల్డ్ లైన్ 1098 కు గాని, సంబంధిత అధికారులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. పిల్లల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేసి బాల్య వివాహాన్ని అడ్డుకోవడంలో కీలక పాత్ర పోషించిన ఆదోని కి చెందిన శక్తి బృందం పోలీసు కానిస్టేబుల్ లు కె. రాజేశ్వరి, ఎస్. వీరాంజనేయుల ను, సహాకరించిన ఇతర శాఖల సిబ్బంది సేవలను కర్నూలు ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మహిళా పియస్ సిఐ మస్తాన్ వలి పాల్గొన్నారు.

# ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి అధ్యక్షతన 'దిశా' సమీక్షా సమావేశం

**జిల్లా అభివృద్ధి,పెండింగ్ నిధులపై సమగ్ర చర్చ**

**ఉపాధి హామీ బకాయిలు, పంట బీమా,ఇళ్ల మౌలిక వసతులపై ఎంపీ అవినాష్ రెడ్డి డిమాండ్**




**కడప మన జనప్రగతి జులై 17:**కడప జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాల పర్యవేక్షణ, సమన్వయం కోసం ఏర్పాటు చేసిన "దిశ సమీక్షా సమావేశం" పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్,జెడ్పీ చైర్మన్ రామగోవింద్ రెడ్డి, బద్వేల్ ఎమ్మెల్యే డా.సుధా, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డితో పాటు జిల్లా అధికారులు మరియు ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాకు సంబంధించిన పలు పెండింగ్ అంశాలను కేంద్రం దృష్టికి తీసుకెళు న్నట్లు తెలిపారు. జిల్లాలో ఉపాధి హామీ పథకానికి సంబంధించి దాదాపు రూ.160 కోట్ల మెటీరియల్ కాంపోనెంట్ బకాయిలు రావాల్సి ఉందని, ఈ బకాయిలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఈ సమావేశం ద్వారా కోరడం జరిగింది. అలాగే,జిల్లా రైతులకు అందవలసిన పెండింగ్ క్రాప్ ఇన్సూరెన్స్ నిధులు రూ.173 కోట్లు ఉన్నాయని వివరించారు. అధికారుల సమాచారం ప్రకారం కేంద్రం తన వంతు వాటాను చెల్లించిందని,రాష్ట్ర ప్రభుత్వం కూడా తన వాటాను త్వరగా విడుదల చేస్తే ఈ బీమా నిధులు రైతులకు అందుతాయని తెలిపారు. ప్రస్తుతం రైతులు చెల్లిస్తున్న ఖరీఫ్ పంటల బీమా ప్రీమియం గడువును రైతుల విజ్ఞప్తి మేరకు ఈ నెల 24వ తేదీ వరకు పెంచినట్లు కలెక్టర్ ఈ సమావేశంలో వెల్లడించారు. వాతావరణ ఆధారిత పంటల బీమా నిబంధనల్లోని లోపాలను సవరించాలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ సమావేశం ద్వారా ప్రతిపాదనలు పంపుతున్నారు అని ఎంపీ తెలిపారు. ప్రస్తుతం మండలానికి కేవలం రెండు ఆటోమేటెడ్ వెదర్ స్టేషన్లు మాత్రమే ఉన్నాయని,అవి కూడా సరిగ్గా పనిచేయడం



లేదని కాబట్టి ప్రతి గ్రామంలోనూ ఒక వర్కింగ్ వెదర్ స్టేషన్ ఏర్పాటు చేయాలన్నారు. గాలి వేగం 50 కిలోమీటర్ల కంటే ఎక్కువ ఉంటేనే అరటి,మామిడి లాంటి పంటల నష్టపరిహారం ఇస్తామనే నిబంధనను పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేశారు. గాలి వేగంతో సంబంధం లేకుండా, గాలి వల్ల పంట నేలమట్టమై నష్టపోయిందా లేదా అనేదాన్ని మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వంలో 2019-24 మధ్య జిల్లాకు దాదాపు 98,375 ఇళ్లు (దాదాపు లక్ష ఇళ్లు) మంజూరయ్యాయని, అందులో 50 వేలకు పైగా ఇళ్లు పూర్తవ్వగా,మిగిలిన 50 వేల ఇళ్లు ఆర్‌సీ, ఆర్‌ఎల్ వంటి వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వంలో గడిచిన 26 మాసాల్లో ఈ జిల్లాకు కొత్తగా మంజూరైంది కేవలం 1,900 ఇళ్లు మాత్రమేనని పేర్కొన్నారు. అర్హులైన పేదలకు వెంటనే కొత్త ఇళ్లను మంజూరు చేయాలని, జగనన్న హౌసింగ్ కాలనీల్లో నిలిచిపోయిన మౌలిక వసతులైన రోడ్లు,డ్రైన్లు, పైప్‌లైన్లు,విద్యుద్దీకరణ మరియు ఎస్టీపీల పనులను ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కడప (ఒక్కో లేఅవుట్‌లో 6 వేలకు పైగా ఇళ్లు),ప్రొద్దుటూరు (ఒక్కో లేఅవుట్‌లో 10 వేలకు పైగా ఇళ్లు),పులివెందుల (7 వేలకు పైగా ఇళ్లు) హౌసింగ్ లేఅవుట్లలో మౌలిక వసతులు కల్పిస్తేనే ప్రజలు వాటిలోకి వెళ్తారని స్పష్టం చేశారు. జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ హైవే కాకుండా మిగిలిన జాతీయ రహదారులకు సంబంధించి దాదాపు 440 కిలోమీటర్ల రహదారి పనులు జరుగుతున్నాయని తెలిపారు. గత జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలోనే ఈ రోడ్లన్నీ స్టేట్ హైవేస్ నుండి నేషనల్ హైవేస్‌గా అప్‌గ్రేడ్ అయ్యి,టెండర్లు పిలిచి పనులు ప్రారంభించబడ్డాయని గుర్తు చేశారు. ప్రస్తుతం భూసేకరణ మరియు ఇతర కారణాల వల్ల నత్తనడకన సాగుతున్న ఈ పనులన్నింటినీ వేగవంతం చేయాలని అధికారులను కోరారు. ఈ విధంగా జిల్లాలోని ప్రధాన సమస్యలు మరియు అభివృద్ధి పనులపై సమగ్రంగా సమీక్ష నిర్వహించి, కేంద్ర ప్రభుత్వానికి పంపవలసిన సిఫార్సులు మరియు ప్రతిపాదనలను సిద్ధం చేయడం జరిగిందన్నారు.

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
18 - 07 - 2026

## పంటల బీమా నమోదు గడువు లోపల చేసుకోండి



**చిట్వేలి మన జనప్రగతి జూలై 17:**–రైతులు తాము పండిస్తున్న పంటల బీమా కొరకు గడువు లోపల నమోదు చేసుకోవాలని చిట్వేలి వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ తెలిపారు. ఖరీఫ్ 2026–27 సంవత్సరానికి దిగు బడి ఆధారిత భీమా పథకం క్రింద వరి, పునర్వ్యవస్థీకరించిన వాతా వరణ ఆధారిత భీమా పథకం క్రింద వేరుశనగ, అరటి పంటలు ఎంపిక చేశారని తెలిపారు. వరి, వేరుశనగ,అరటి పంటకు మండలాన్ని భీమా యూనిట్ గా పరిగణిస్తారని తెలిపారు. వరి ఎకరానికి. రైతు కట్టవలసిన ప్రీమియం సొమ్ము రూ.840, వేరుశనగ పంటకు రూ.560, అరటి పంటకు రూ.3025 చెల్లించాలని తెలిపారు. వేరుశనగ, అరటి పంటకు జూలై 24, వరి పంటకు ఆగస్టు15 లోపల చెల్లించాలని కోరారు. పంట రుణాలు తీసుకున్న రైతులకు పంటకు ఇచ్చిన రుణం నుండి ప్రీమియం సొమ్మును భీమా కొరకు బ్యాంకు వారే జమ చేస్తారని తెలిపారు. పంట రుణం తీసుకోని రైతులు కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా లేదా స్వయ ంగా ఎన్సీఐపి పోర్టల్ నందు నమోదు చేసుకోవాలని తెలిపారు.

## పైప్‌లైన్ లీకేజీతో వృథాగా తాగునీరు.

### - నెలరోజులుగా మరమ్మతులు లేక కాలనీవాసుల ఆగ్రహం



**సిద్ధవటం మన జనప్రగతి జూలై 17:**–సిద్ధవటం మండలం మూలపల్లి ఎస్సీ కాలనీలో తాగునీటి పైప్‌లైన్ లీకేజీ కారణంగా నెలరోజులుగా తాగునీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పైప్‌లైన్ మరమ్మతుల కోసం గత నెలలో గోతులు తవ్వి పనులు మధ్యలోనే నిలిపివేయడంతో నీరు నిరంతరం వృథా అవుతుండటంతో పాటు,తాగునీటి సరఫరా కూడా సక్రమంగా అందడం లేదని వాపోయారు. గోతులు అలాగే ఉండటంతో చిన్నారులు ప్రమాదవశాత్తు వాటిలో పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే మరమ్మతులు పూర్తి చేసి తాగునీటి సమస్యను పరిష్కరి ంచాలని కోరారు. ఈ విషయమై డిప్యూటీ ఎంపీడీవో మెహతాబ్ యాస్మిన్ను వివరణ కోరగా, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి, త్వరితగతిన మరమ్మతు పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## డీకేటీ రైతు భూమి ఆన్‌లైన్‌లో అక్రమ బదిలీ..?

### - వృద్ధ మహిళా రైతు న్యాయం కోసం అధికారుల చుట్టూ ప్రదక్షిణలు



**సిద్ధవటం మన జనప్రగతి జూలై 17:**–మండలంలోని వెలుగుపల్లి గ్రామంలో డీకేటీ పట్టా భూమిని అక్రమంగా ఆన్‌లైన్‌లో ఇతరుల పేర్లకు నమోదు చేసి కబ్జా చేశారని ఓ వృద్ధ మహిళా రైతు ఆవేదన వ్యక్తం చేసింది. గ్రామానికి చెందిన వెంకటలక్ష్మమ్మ మాట్లాడుతూ...సర్వే నంబర్ 76లో 2.44 ఎకరాల డీకేటీ భూమి 1988లో తన భర్త వెంకరెడ్డి పేరుతో మంజూరైందని, ఆ భూమిలో సాగు చేసుకుంటూ జీవనం సాగించామని తెలిపింది. 2022లో తన భర్త అనారోగ్యంతో మంచానపడి అనంతరం మృతి చెందగా, స్థానికేతర వ్యక్తి రాజకీయ పలుకుబడితో తన బంధువుల పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసి భూమిని కాజేశాడని ఆరోపించింది. ఈ విషయంపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు న్యాయం జరగలేదని వాపోయింది. ఈ విషయమై స్థానిక వీఆర్వో కేశవులు మాట్లాడుతూ, సర్వే నంబర్ 76లో భూమి ప్రస్తుతం లక్ష్మమ్మ సాగులోనే ఉందని తెలిపారు. మాధవరం గ్రామానికి చెందిన సంబంధిత వ్యక్తికి ఇప్పటికే మూడుసార్లు విచారణకు హాజరుకావాలని నోటీసులు జారీ చేసినప్పటికీ స్పందించలేదన్నారు. తహసీల్దార్ విజయ్‌కుమార్ ఆదేశాల మేరకు మరోసారి నోటీసులు జారీ చేసి పూర్తి స్థాయి విచారణ నిర్వహించి, నిజమైన హక్కుదారుడికి న్యాయం చేస్తామని వెల్లడించారు.

## పులివెందుల 'మానవత' సంస్థకు రూ.50 వేల విరాళం

### ● దాతల దాతృత్వాన్ని కొనియాడిన కార్యవర్గం



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూలై 17:** స్థానిక 'మానవత' స్వచ్ఛంద సేవా సంస్థకు సమాజ సేవపై మక్కువతో ఇరువురు వ్యక్తులు రూ.50 వేల భారీ విరాళాన్ని ప్రకటించి, సంస్థలో శాశ్వత సభ్యత్వాన్ని స్వీకరించారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక పెన్షనర్ల భవనంలో నూతన కార్యవర్గ సమావేశం ఘనంగా నిర్వహించారు. **రూ.50 వేల విరాళం అందించిన దాతలు** దివంగత వెన్నపూస శ్రీనివాసరెడ్డి (మాజీ తొండూరు ఎం.ఈ.ఓ) జ్ఞాపకార్థం ఆయన ధర్మపత్ని లక్ష్మీకాంతమ్మ కుటుంబ సభ్యులు డాక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి,డాక్టర్ వసుంధరలు కలిసి రూ.25,000 విరాళంగా అందజేశారు.దివంగత ఎలుగోటి శివనారాయణ రెడ్డి (బలపనూరు) జ్ఞాపకార్థం ఆయన కుమారుడు జగదీశ్వర రెడ్డి,సువర్ణలత దంపతులు కలిసి రూ.25,000 విరాళాన్ని సమర్పించారు.ఈ సమావేశంలో పాల్గొన్న సంస్థ చైర్మన్ డి.వి.కొండారెడ్డి,నూతన అధ్యక్షుడు చవ్వా కృష్ణా రెడ్డి మరియు జిల్లా కార్యవర్గ సభ్యులు జి.చంద్ర శేఖర్ రెడ్డిలు మాట్లాడుతూ దాతల సేవా నిరతిని,ఉదార గుణాన్ని ప్రత్యేకంగా అభినందించారు.అనంతరం,2026–27 సంవత్సరానికి గానూ సంస్థ సేవా కార్యక్రమాలను మరింత వేగవంతం చేసేందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించి, ముందుకు సాగాలని ఏకగ్రీవంగా తీర్మానించారు.ఈ కార్యక్రమంలో పులివెందుల పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు ఏ.వీ.గోపాల్ రెడ్డి,సంస్థ కోశాధికారి హరిశ్చంద్రా రెడ్డి,వివిధ విభాగాల డైరెక్టర్లు మరియు ఇతర కార్యవర్గ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## షైనింగ్ స్టార్స్ అవార్డ్సుకు శ్లోక హైస్కూల్ విద్యార్థిని ఎంపిక

### ● పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభకు రాష్ట్ర స్థాయి గుర్తింపు
### ● పాఠశాల కరస్పాండెంట్ బండి నవనేశ్వర్ రెడ్డి హర్షం



**వేంపల్లె మన జనప్రగతి జూలై 17:**–ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న షైనింగ్ స్టార్స్ అవార్డ్సుకు వేంపల్లెలోని శ్లోక హైస్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థిని హరిణి ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ బండి నవనేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రాష్ట్రవ్యాప్తంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం షైనింగ్ స్టార్స్ అవార్డ్సును అందజేస్తోందన్నారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థిని హరిణి ఈ ప్రతిష్టాత్మక అవార్డుకు ఎంపిక కావడం గర్వకారణమని పేర్కొన్నారు. విద్యార్థిని సాధించిన ఈ విజయం ఆమె కృషి, తల్లిదండ్రుల సహకారం, ఉపాధ్యాయుల అంకితభావంతో కూడిన బోధనకు నిదర్శనమని అన్నారు. భవిష్యత్తులో కూడా విద్యార్థులు విద్యా రంగంలో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు హరిణిని అభినందించి, ఆమె భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

## నల్లపురెడ్డిపల్లి పంచాయతీలో అవినీతి బాగోతం

### ● బాధ్యులపై చర్యలకు గ్రామస్తుల డిమాండ్ ● బోరు పైపులు,విద్యుత్ కేబుళ్లు మాయం..? ● అవినీతిని బయటపెట్టిన టీడీపీ నాయకుడు యోగానంద రెడ్డి ● అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూలై 17:–** పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లి గ్రామపంచాయతీలో భారీ అవినీతి,ప్రభుత్వ ఆస్తుల దుర్వినియోగం ఉదంతం వెలుగుచూసింది.గత పాలకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభుత్వ సొమ్మును,ఆస్తులను దుర్వినియోగం చేశారని స్థానికులు,టీడీపీ నాయకులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు.పంచాయతీ పరిధిలో కనీస మౌలిక సదుపాయాల నిర్వహణ పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గ్రామంలో గతంలో సుమారు 1,200 అడుగుల లోతుతో ఏర్పాటు చేసిన బోరుబావుల్లో ప్రస్తుతం 400 నుంచి 450 అడుగుల లోతులోనే నీరు అందుతోందని అయితే, మిగిలిన సుమారు 600 అడుగుల పైపులు,విద్యుత్ కేబుళ్లను అక్రమంగా తొలగించారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.లక్షల రూపాయల విలువైన ఆ ప్రభుత్వ సామగ్రి అంతా ఏమైందో,ఎక్కడికి తరలించారో అధికారులు సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేస్తున్నారు.మరోవైపు గ్రామంలోని అనేక వీధిలైట్లు నెలలుగా పనిచేయడం లేదు.రాత్రి వేళల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ,కనీస నిర్వహణను కూడా గత పాలకవర్గం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని స్థానికులు విమర్శిస్తున్నారు.ప్రభుత్వ నిధులతో కొనుగోలు చేసిన సామగ్రి మాయమవడం వెనుక పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని వారు స్పష్టం చేస్తున్నారు.కళ్లముందే ప్రభుత్వ ఆస్తుల దుర్వినియోగం జరుగుతున్నా,ఆధారాలు కనిపిస్తున్నా అధికారులు స్పందించకపోవడం దారుణం అని దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని నల్లపురెడ్డిపల్లి గ్రామస్తులు కోరుతున్నారు.టీడీపీ నేత యోగానంద రెడ్డి ఈ అవినీతి బాగోతాన్ని టీడీపీ నాయకుడు యోగానంద రెడ్డి తీవ్రంగా ఖండించారు.బాధితుల ఫిర్యాదు మేరకు ఆయన గ్రామాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.ఈ వ్యవహారాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి,సమగ్ర విచారణ జరిపించేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రజాధనాన్ని,ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేసిన వారిని చట్టపరంగా వదిలిపెట్టే ప్రసక్తే లేదని టీడీపీ నేతలు స్పష్టం చేశారు.నల్లపురెడ్డిపల్లి పంచాయతీలో జరిగిన ఈ అక్రమాలపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి,సమగ్ర దర్యాప్తు జరిపి వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని స్థానికులు కోరుతున్నారు.

## డాక్టర్ యుగంధర్ నూతన డీఎంహెచ్‌వోగా బాధ్యతల స్వీకారం



**కడప మన జనప్రగతి జూలై 16:**–కడప జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో)గా డాక్టర్ యుగంధర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు కృష్ణా జిల్లా డీఎంహెచ్‌ఓ గా విధులు నిర్వహించిన ఆయన బదిలీపై కడప జిల్లాకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ప్రోగ్రాం అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో అమలవుతున్న అన్ని ఆరోగ్య కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసి,ప్రతి విభాగంలో వంద శాతం లక్ష్య సాధనకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో కడప జిల్లాను ఆరోగ్య సేవల అమలులో అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రతి ఉద్యోగి అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా ప్రతి ఉద్యోగి తన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని, ముఖ్యంగా మాతా–శిశు సంరక్షణ సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. "ఏ తల్లి ప్రసవ సమయంలో మరణించకూడదు ఏ శిశువు జన్మించిన వెంటనే మరణించరాదు" అనే లక్ష్యంతో ఆరోగ్య సిబ్బంది సేవలు అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ మరియు కుష్టు వ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ రవిబాబు, ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ప్రవీణ్, కోఆర్డినేటర్ డాక్టర్ ఆరిపుల్లా, నేషనల్ హెల్త్ మిషన్ కోఆర్డినేటర్ డాక్టర్ మహమ్మద్ తాహా, డెమో భారతి, అడ్మినిస్ట్రేటివ్ అధికారి విజయభాస్కర్‌తో పాటు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొని డాక్టర్ యుగంధర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## కప్పల లక్ష్మీదేవి నేత్రదానం..

### ● ఇద్దరు అంధులకు చూపునిచ్చిన మహోన్నత సేవ




**సింహాద్రిపురం మన జనప్రగతి జూలై 17:**–సింహాద్రిపురం మండలం బలపనూరు గ్రామానికి చెందిన కప్పల లక్ష్మీదేవి (73) మరణించగా ఆమె కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరించి ఆదర్శంగా నిలిచారు. మృతురాలి కుమారులు వెంకట నారాయణ,కొండప్ప, కుమార్తెలు సరోజ,చంద్రకళ, కోడళ్ళు సావిత్రి,నాగేశ్వరి, అల్లుళ్లు జయసింహ, సూర్యనారాయణ,మనవళ్లు రాఘవేంద్ర, రాజు, పృథ్వీరాజ్,సాయి కిరణ్, భాను కిరణ్,మనవరాళ్లు సువర్ణ,ఊర్మిళ,హేమలత, యశోద,దీపిక,మౌనికలు నేత్రదానం చేయాలని నిర్ణయించి జిల్లా అంధత్వ నివారణ సంస్థ మరియు స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షులు రాజుకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్ ప్రశాంత్‌తో కలిసి మృతురాలి నివాసానికి చేరుకుని పార్థివ దేహం నుండి కార్నియాలను సేకరించారు. అనంతరం వాటిని హైదరాబాద్‌లోని ఎల్.వి. ప్రసాద్ నేత్రాలయానికి పంపించారు. ఈ నేత్రదానం ద్వారా ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించే అవకాశం లభించనుంది. ఈ సందర్భంగా స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు మాట్లాడుతూ కుటుంబ సభ్యుడు లేదా సన్నిహితుడు మరణించిన సందర్భంలో నేత్రదానం చేయదలచిన వారు 9966509364 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఒక మనిషి మరణానంతరం మట్టిలో కలిసిపోయే నేత్రాలను దానం చేయడం ద్వారా ఇద్దరు అంధులకు వెలుగు నింపవచ్చని మరణించిన తర్వాత కూడా వారి చూపు ఈ ప్రపంచాన్ని మరొకరికి చూపించే మహోన్నత సేవగా నిలుస్తుందని తెలిపారు. ప్రతి కుటుంబం నేత్రదానం పట్ల అవగాహన పెంచుకుని ముందుకు రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నేత్రదానం చేసిన కప్పల లక్ష్మీదేవి కుటుంబ సభ్యులను గ్రామ పెద్దలు,బంధువులు, సన్నిహితులు,జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రతినిధులు మరియు స్నేహిత అమృత హస్తం సేవాసమితి సభ్యులు అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.

## కాపులు ఆంధ్రరాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలి: మాజీ కేంద్రమంత్రి చింతా మోహన్




**కాకినాడ మన జనప్రగతి జూలై 17:**–కాపు సామాజికవర్గానికి చెందిన వ్యక్తి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కావాలని, అది కాంగ్రెస్‌తోనే సాధ్యమని మాజీ కేంద్రమంత్రి చింతా మోహన్ అన్నారు. శుక్రవారం వెంకీ రెసిడెన్సీలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల తన మిత్రుడు మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం అకాల మరణం పట్ల సంతాపం వ్యక్తం చేశారు. కాపులవీధిలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసినప్పుడే పద్మనాభం ముఖ్యమంత్రి అవుతారని తాను ఊహించానన్నారు. దళితులు, కాపులు కలిసి ముందుకెళ్లాలన్నది తమ ఇద్దరి లక్ష్యమన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా కాపు సామాజికవర్గానికి చెందిన వ్యక్తి ఇప్పటివరకు సీఎం కాకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు 19 ఏళ్లు, వైఎస్ కుటుంబం 11 ఏళ్లు పాలించిందని, 20 శాతానికి పైగా జనాభా ఉన్న కాపులు ఎందుకు సీఎం కాకూడదన్నదే తన లక్ష్యమన్నారు. కాపులు ముఖ్యమంత్రి అయ్యే అవకాశం కాంగ్రెస్‌లో తప్ప ఇతర పార్టీల్లో లేదన్నారు. ఆంధ్రాలో తమిళనాడు తరహా రాజకీయ పరిస్థితులు రానున్నాయన్నారు. 2029లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. మోడీ పాలనపై విమర్శలు చేసిన ఆయన, అయోధ్య పేరుతో వసూలు చేసిన నిధులపై సీబీఐ దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్లకు రుణమాఫీ చేసిన ఘనత బీజేపీదేనని, కాంగ్రెస్ రైతులకు మాత్రమే రుణమాఫీ చేసిందన్నారు. గాజాపాలస్తీనా ఘటనలపై కేంద్రం స్పందించలేదని విమర్శించారు. రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు పడిపోతున్నాయని, జగన్‌పై ఉన్న ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల విచారణలో జాప్యం ఎందుకని ప్రశ్నించారు. జూలై 29 నుంచి కొత్త రాజ్యాంగం అమల్లోకి వస్తుందంటూ దేశం ప్రమాదంలో పడుతుందని ఆయన ఆరోపించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు చెక్కా నూకాజీ, పబ్బినీడి శ్రీనివాసు పాల్గొన్నారు.

# శుక్రవారం వేళ శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



**సిద్ధవటం మన జనప్రగతి జూలై 17:-**మాచుపల్లి గ్రామంలోని శ్రీ రేణుకా ఎల్లమ్మ అమ్మవారి ఆలయం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్రమైన రోజైన శుక్రవారం సందర్భంగా ఆలయ అర్చకులు సుబ్బరాజు ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే విశేష పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సుప్రభాత సేవతో ప్రారంభమైన పూజల్లో అమ్మవారికి పవిత్ర జలాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి, అనంతరం పుష్పాలు, పత్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ప్రత్యేక అర్చనలు,కుంకుమార్చనలు,మహామంగళహారతులు ఘనంగా సమర్పించారు. ఈ సందర్భంగా మాచుపల్లి గ్రామంతో పాటు సిద్ధవటం మండలంలోని పరిసర గ్రామాలు, జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. దర్శనానంతరం అర్చకులు భక్తులకు వేదాశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ కమిటీ సభ్యులు అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లు చేసి దర్శనం సజావుగా జరిగేలా చర్యలు చేపట్టారు.

# శుభ్రత పాటిస్తే సీజనల్ వ్యాధులకు చెక్:డాక్టర్ మురళి




**సిద్ధవటం మన జనప్రగతి జూలై 17:-**ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే సీజనల్ వ్యాధులు దరిచేరవని పి. కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మురళి తెలిపారు. సిద్ధవటం మండలం సంటిగారిపల్లె గ్రామంలో శుక్రవారం నిర్వహించిన 104 వైద్య శిబిరంలో ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ మురళి మాట్లాడుతూ, జలుబు, దగ్గు, విరోచనాలు వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు స్వయంగా మందులు వాడకుండా సమీప ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులను సంప్రదించాలని సూచించారు.ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టి డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులను నివారించవచ్చని తెలిపారు.ప్రతి ఒక్కరూ పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్య, 104 వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# పులివెందులలో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం: ఏఈఈ జగదీశ్వర్ రెడ్డి



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జులై 17:-**పులివెందుల పట్టణంలోని పలు ప్రాంతాల్లో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈఈ జగదీశ్వర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ల పరిధిలో అత్యవసర మరమ్మతులు,కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు పనుల కారణంగా ఈ కింద పేర్కొన్న సమయాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు చెట్ల కొమ్మల నరికివేత (ట్రీ కటింగ్) పనుల నిమిత్తం 33/11 కెవి కోతి సమాధి సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కెవి పార్నపల్లి రోడ్డు ఫీడర్ ప్రాంతాలు, జేఎన్టీయూ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కెవి మార్కెట్ యార్డ్ ఫీడర్ ప్రాంతాల లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.అలాగే డిగ్రీ కాలేజ్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కెవి డిగ్రీ కాలేజ్ ఫీడర్ పరిసర ప్రాంతాలలో మధ్యాహ్నం 12:00 గంటల నుండి పనులు పూర్తయ్యే వరకు కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులు ఉన్నడం వలన గవర్నమెంట్ హాస్పిటల్ సబ్‌స్టేషన్ పరిధిలోని గవర్నమెంట్ హాస్పిటల్ ఫీడర్ ప్రాంతాలు,పూల అంగళ్ల సర్కిల్ నుండి గవర్నమెంట్ హాస్పిటల్ వరకు ఉన్న పరిసర ప్రాంతాల లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని తెలిపారు.పట్టణ విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి,ఆయా సమయాల్లో విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించవలసిందిగా ఏఈఈ జగదీశ్వర్ రెడ్డి కోరారు.

# మహిళా సాధికారతకు దుర్గాబాయి దేశ్‌ముఖ్ సేవలు అనన్యం:ఎమ్మెల్సీ పద్మశ్రీ




**కాకినాడ మన జనప్రగతి జూలై 17:-**భారతీయ మహిళా సాధికారత, విద్య, సామాజిక సంక్షేమ రంగాలలో దుర్గాబాయి దేశ్‌ముఖ్ అందించిన అపారమైన సేవలు చిరస్మరణీయమని, ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మనందరి బాధ్యతని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ పేర్కొన్నారు.విద్యుత్‌నగర్‌లోని ఐడియల్ కళాశాలలో ఆల్ ఇండియా ఉమెన్స్ కాన్ఫరెన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్యామ్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ గుంటూరి శైలజకు దుర్గాబాయి దేశ్‌ముఖ్ అవార్డును ఎమ్మెల్సీ చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పద్మశ్రీ మాట్లాడుతూ గ్రామీణ బాలికల విద్యకు ప్రాధాన్యత ఇవ్వడం, అట్టడుగు వర్గాలకు చెందిన మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారానే నిజమైన సాధికారత సాధ్యమవుతుందన్నారు.మహిళలపై జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా గళం విప్పాలని, చట్టపరమైన మార్గాల ద్వారా తమ హక్కులను సాధించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐడబ్ల్యూసి అధ్యక్షురాలు భాను శేషు, అవార్డు గ్రహీత గుంటూరి శైలజ శ్యామ్, కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి. శ్రీకాంత్, వి.వి. లక్ష్మి, డాక్టర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పులివెందులలో నాటు సారాయి పట్టివేత

**● ఒకరి అరెస్ట్,మరొకరిపై కేసు నమోదు**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జులై 17:-** స్థానిక పులంగళ్ళు సర్కిల్ వద్ద ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన దాడుల్లో నాటు సారాయి పట్టుబడింది.ఈ రోజు ఉదయం అందిన నమ్మదగిన సమాచారం మేరకు ఎక్సైజ్ సిబ్బంది ఈ తనిఖీలు చేపట్టారు.ఈ దాడుల్లో ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి 05 లీటర్ల నాటు సారాయిని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. నిందితుడిపై క్రైమ్ నెంబర్ 60/2026 కింద కేసు నమోదు చేశారు.ప్రాథమిక విచారణలో ఈ సారాయిని కర్నూలు జిల్లా మద్దికేరకు చెందిన నాగరాజు సరఫరా చేసినట్లు తేలడంతో, అతనిని కూడా ఈ కేసులో నిందితుడిగా చేర్చారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ నాటు సారాయి తయారు చేయడం,రవాణా చేయడం లేదా విక్రయించడం చట్టరీత్యా తీవ్రమైన నేరమని హెచ్చరించారు.ఇది సమాజానికి,ప్రజల ఆరోగ్యానికి ఎంతో హానికరమని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపట్టిన నవోదయశీ నాటు సారాయి నిర్మూలన కార్యక్రమంలో భాగంగానే ఈ ప్రత్యేక దాడులు నిర్వహించి కేసులు నమోదు చేసినట్లు స్పష్టం చేశారు.ప్రాంతంలో ఎక్కడైనా నాటు సారాయి తయారీ,అమ్మకాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే ప్రజలు వెంటనే స్పందించాలని అధికారులు కోరారు.సమాచారం ఉన్న వారు పులివెందుల ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఎల్.చెన్నారెడ్డి సెల్ నెంబర్ 9866609927 కు నేరుగా ఫిర్యాదు చేయవచ్చని,సమాచారం అందించిన వారి వివరాలు రహస్యంగా ఉంచబడతాయని తెలిపారు.

# అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ, హిట్ అండ్ రన్ కేసులపై జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశము



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జులై 17:-**జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, మరియు రాష్ట్ర న్యాయ సేవాదికార సంస్థ ఆదేశాల మేరకు కర్నూలు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్థి,మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి అధ్యక్షతన- అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ మరియు హిట్ అండ్ రన్ కేసులపై శుక్రవారం జిల్లా స్థాయి అధికారులైన ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు,సూపరింటెండెంట్ అఫ్ పోలీస్లు,జిల్లా ట్రాన్స్పోర్ట్ అధికారులు,జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్లు, డిస్ట్రిక్ట్ జైలు సూపరింటెండెంట్, డిస్టిక్ జైల్ల అధికారి మొదలగు అధికారులతో హైబ్రిడ్ మోడ్లో మానిటరింగ్ మీటింగ్ నిర్వహించడం జరిగినది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ లో జైల్ల లో విచారణ కోసం ఎదురుచూస్తున్న ఖైదీల కేసులను సమీక్షించారు.ఎక్కువకాలం జైల్లో ఉన్న చిన్న నేరాలు చేసిన లేదా పేదరికంతో బెయిల్ పొందలేని నిందితులను విడుదల చేయడానికి మరియు మహిళలు, ఆరోగ్యంతో ఉన్న నిందితుల కేసులపై సమీక్ష నిర్వహించారు.అనంతరం కర్నూలు మరియు నంద్యాల జిల్లాల్లోని హిట్ అండ్ రన్ కేసులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు నష్టపరిహారం త్వరగా అందేలా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. హిట్ అండ్ రన్ కేసుల వేగవంతమైన ప్రక్రియకు సంబంధించి జిల్లాస్థాయి కమిటీలతో సమన్వయం చేసుకొని హిట్ అండ్ రన్ కేసుల క్లైముల వేగవంతమైన ప్రక్రియ కోసం మరియు జనరల్ ఇన్సూరెన్సుకు క్లైములను సమర్పించడం కోసం రెవిన్యూ, పోలీస్ మరియు బీమా కంపెనీలతో సమన్వయం చేసుకోవాలని అలాగే హిట్ అండ్ రన్ కేసుల బాధితులకు లేదా వారిపై ఆధారపడిన వారికి అర్హత ప్రకారం పరిహారం చెల్లింపు జరిగేలా చూడాలన్నారు. అనంతరం జిల్లా జడ్జి గారు ఎనిమిదవ తరగతి ఆపైన చదువుతున్న పేద గిరిజన విద్యార్థినిలు, వికలాంగ విద్యార్థినిలు, తల్లిదండ్రులు లేని విద్యార్థినుల కేటగిరీల నుంచి సుప్రీంకోర్టు ఆఫ్ ఇండియా వారి "ప్రగ్య" స్కాలర్షిప్ ను పొందటానికి జిల్లాకు ఒకరి పేరు చొప్పున ఈనెల 21 లోపల పంపించాలని ఉమ్మడి జిల్లాల కలెక్టర్లకు సూచించారు. ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు మరియు ఎస్పీలు, డిస్టిక్ రెవెన్యూ ఆఫీసర్స్, డిస్టిక్ ట్రాన్స్పోర్ట్ ఆఫీసర్స్, డిటి ఆర్ బి అధికారులు, డి ఎం అండ్ హెచ్ ఓ అధికారులు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ శివ రామ చంద్ర రావు, సంబంధిత శాఖ అధికారులు పాల్గొనడం జరిగింది.

# అంగవైకల్యం శాపం కాదు విజేతలుగా నిలవాలి

**● ప్రముఖ వైద్యురాలు డాక్టర్ శరణ్య నవీన్ ● కుమార్తె పుట్టినరోజున దివ్యాంగులకు గృహోపకరణాలు పంపిణీ చేసిన డాక్టర్ శరణ్య నవీన్ దంపతులు**





**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జులై 17:-** అంగవైకల్యం అనేది కేవలం భౌతిక,శారీరక లోపమే కానీ అది వారి జీవితాలకు శాపం కాకూడదు అని ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ శరణ్య నవీన్ పేర్కొన్నారు. వికలత్వం అనేది శరీరానికే కానీ మనసుకు కాదని అది అనువంశిక,జన్యుపరమైన లోపమే తప్ప కొందరి అపోహల ప్రకారం జన్మజన్మల పాపం కాదని ఆమె స్పష్టం చేశారు. ప్రపంచంలో ఎంతోమంది తమ వైకల్యాన్ని అధిగమించి అద్భుతాలు సృష్టించారని,వారి స్ఫూర్తితో దివ్యాంగులు వివిధ వృత్తుల్లో రాణించాలని ఆమె పిలుపు నిచ్చారు.పులివెందుల పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో గల వికలాంగుల కమ్యూనిటీ భవన్ లో డాక్టర్ శరణ్య నవీన్ కుమార్తె సాయి నవీషా ఏడవ జన్మదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన విశ్రాంత వైద్యాధికారి డాక్టర్ కొండయ్య కుటుంబ సభ్యులు చిన్నారితో జన్మదిన కేక్ కట్ చేయించి,దివ్యాంగులకు పంచారు.ఈ సందర్భంగా డాక్టర్ శరణ్య నవీన్ మాట్లాడుతూ ప్రతి ఏడాది తమ కుటుంబ సభ్యుల జన్మదినోత్సవాలను దివ్యాంగుల మధ్య జరుపుకుని వారికి చేయూత అందిస్తామని అలాగే తమ ఆసుపత్రిలో దివ్యాంగులకు ఉచితంగా వైద్య చికిత్సలు అందిస్తామని ప్రకటించారు. అవయవ లోపం ఉన్నవారికి చేతివృత్తుల శిక్షణే శ్రీరామరక్షగా నిలుస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు.అనంతరం వైద్య దంపతులు సమకూర్చిన గృహోపకరణాలను టైలరింగ్ శిక్షణ పొందుతున్న మహిళలకు వారి కుటుంబ సభ్యుల చేతుల మీదుగా పంపిణీ చేశారు.చిన్నారి సాయి నవీషా ఆయురారోగ్యాలతో, ఆనందోత్సాహాలతో వర్ధిల్లాలని దివ్యాంగులు మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి,దివ్యాంగుల టైలరింగ్ టీచర్ మల్లీశ్వరి,రిటైర్డ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కొండయ్య,రమాదేవి, డాక్టర్ నవీన్,శరణ్య,సాయి నవీషా,తనయ్ సాయి వత్సవ్,ప్రవీణ్,సోనీ భవాని, సంహిత్,జనార్ధన్,మాధురి, సౌజన్య,ఆసుపత్రి మేనేజర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

# పగిలిన మంచినీటి ట్యాంకుతో విద్యార్థులకు తాగునీటి కష్టాలు



**సిద్ధవటం మన జనప్రగతి జూలై 17:-**మండలంలోని ఉక్కాయపల్లె ప్రాథమిక పాఠశాలలో గత రెండు నెలలుగా మంచినీటి ట్యాంకు పగిలిపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగునీటి సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ప్రతిరోజూ తమ ఇళ్ల నుంచి నీటి సీసాలు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. వెంటనే స్పందించి కొత్త మంచినీటి ట్యాంకు ఏర్పాటు చేసి విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని తల్లిదండ్రులు అధికారులను కోరుతున్నారు. ఈ విషయమై పాఠశాల ఉపాధ్యాయురాలు నిహారిక మాట్లాడుతూ...మంచినీటి ట్యాంకు పగిలిపోయిన విషయం వాస్తవమేనని, సమస్యను ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. త్వరలోనే తాగునీటి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని సమస్యను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

# సింహాద్రిపురం శ్రీ వివేకానంద పాఠశాల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వ పురస్కారాలు

**- షెనింగ్ స్టార్ అవార్డుకు విద్యార్థుల ఎంపిక**




**సింహాద్రిపురం మన జనప్రగతి జులై 17:**రాష్ట్ర ప్రభుత్వం పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఇచ్చే ప్రతిష్టాత్మక షెనింగ్ స్టార్ అవార్డుకు సింహాద్రిపురం శ్రీ వివేకానంద ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన ఆర్.అమృత (595 మార్కులు), బి.ఎండి. హాజీ అక్రమ్ (592 మార్కులు),ఎస్.హిమజ (590 మార్కులు) మరియు జి.అభినాష్ (576 మార్కులు) ఈ అవార్డుకు ఎంపికైనట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది.ఈ నెల 20వ తేదీన జిల్లా కేంద్రంలో జరిగే కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ మంత్రి సవిత జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి చేతుల మీదుగా ఈ విద్యార్థులకు అవార్డులను ప్రదానం చేయనున్నారు.అవార్డు కింద ప్రతి విద్యార్థికి రూ.20,000 నగదు,ఒక బంగారు పతకం ప్రశంసా పత్రాన్ని అందజేస్తారు.పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి,రాష్ట్ర ప్రభుత్వ అవార్డుకు ఎంపికైన విద్యార్థులను శ్రీ వివేకానంద ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ కె.ఖాదర్ వలి,డైరెక్టర్ కె.బాషా,హెడ్ మిస్ట్రెస్ కె.షహనాజ్ బేగం మరియు ఉపాధ్యాయ బృందం ఘనంగా అభినందించారు

# అంబేద్కర్ గురుకుల పాఠశాలలో సీట్ల సంఖ్య పెంచాలి

**- ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి విజ్ఞప్తి**



**పత్తికొండ మన జనప్రగతి జూలై 17:-**పత్తికొండలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో సీట్ల సంఖ్యను పెంచి, దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థినికి ప్రవేశం కల్పించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ప్రభుత్వాన్ని కోరింది.శుక్రవారం ఏఐఎస్ఎఫ్ నాయకులు గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థినులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ మండల సహాయ కార్యదర్శి విక్రమ్ మాట్లాడుతూ..పత్తికొండ ప్రాంతం కరువుతో కూడిన వెనుకబడిన ప్రాంతమని, ఉపాధి కోసం అనేక కుటుంబాలు వలసలు వెళ్లే పరిస్థితి ఉందన్నారు. ఇలాంటి ప్రాంతాల్లోని పేద విద్యార్థినులకు గురుకుల విద్య ఎంతో ఉపయోగకరమని, అందువల్ల పాఠశాలలో సీట్ల సంఖ్యను పెంచి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు సంతోష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



# రాజకీయ ఘర్షణలు కాదు..అభివృద్ధి, ఉద్యోగాలపై సమాధానం చెప్పాలి

**● ప్రొద్దుటూరు కాంగ్రెస్ ఇంచార్జ్ ఇర్ఫాన్ భాష డిమాండ్**



**ప్రొద్దుటూరు మన జనప్రగతి జూలై 17:-**ప్రొద్దుటూరులో రాజకీయ విమర్శలు, పరస్పర ఆరోపణలతో కాలం గడపకుండా అభివృద్ధి, ఉపాధి అవకాశాలు, ప్రజా సమస్యల పరిష్కారంపై అధికార, ప్రతిపక్ష నాయకులు సమాధానం చెప్పాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ఇర్ఫాన్ భాష డిమాండ్ చేశారు.శుక్రవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత నాలుగు దశాబ్దాలుగా ప్రొద్దుటూరు ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేదని విమర్శించారు. ప్రజా సమస్యలను విస్మరించి రాజకీయ ఘర్షణలు, ఆరోపణలు, ప్రత్యారోపణలకే ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు.మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ప్రస్తావించిన 5 శాతం ఎక్సెస్, మార్కెట్ నిర్మాణం, రివర్స్ టెండర్ల అంశాలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. అలాగే ఇప్పటికీ బస్‌స్టేషన్ ప్రారంభం కాకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు.ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల భృతి, పరిశ్రమల ఏర్పాటు, ఉపాధి అవకాశాల కల్పన వంటి హామీలు అమలు కాలేదని విమర్శించారు. రోడ్లు, కాలువల నిర్మాణమే అభివృద్ధి కాదని, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వెల్లడించాలని కోరారు.ప్రొద్దుటూరులో వరుసగా రాజకీయ ఘర్షణలు, దాడులు, హత్యలు, అరెస్టులు చోటుచేసుకోవడం ఆందోళనకరమని అన్నారు. డీఏడబ్ల్యూ కళాశాల వ్యవహారం, మున్సిపల్ కార్యాలయంలో తనపై జరిగిన దాడి, ఎస్ఎస్ మాల్ వివాదం, కొత్తపల్లి పంచాయతీ స్థల వివాదం, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌కు వచ్చిన బెదిరింపులపై బాధ్యులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.నందం సుబ్బయ్య హత్య కేసులో ప్రత్యేక విచారణ ఇప్పటికీ ముందుకు సాగకపోవడంపై ప్రశ్నించిన ఆయన, మార్కెట్‌లో నిర్మించిన షెడ్ల చట్టబద్ధతపై ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి స్పష్టత ఇవ్వాలని కోరుతూ,కూటమి ప్రభుత్వం చేసే ప్రతి అక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు.

# పీలేరు పంచాయతీకి అరుదైన గౌరవం..ఐఎస్ఓ గుర్తింపు

**- ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి చొరవతో రాష్ట్ర స్థాయిలో గుర్తింపు**




**పీలేరు మన జనప్రగతి జూలై 17:-**ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా అత్యుత్తమ పాలన,పారదర్శకత, నాణ్యమైన పౌర సేవలను అందిస్తున్న 23 గ్రామ పంచాయతీలకు అంతర్జాతీయ ప్రమాణాల ఐఎస్ఓ గుర్తింపు లభించింది.అందులో భాగంగా పీలేరు గ్రామ పంచాయతీకి కూడా ఈ అరుదైన గౌరవం లభించిందఅని తెలిపారు.ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవతో పీలేరు పంచాయతీలో మౌలిక వసతుల కల్పన, పంచాయతీ రికార్డుల పూర్తి డిజిటలైజేషన్, మెరుగైన ప్రతిభ కనబరచడం, సత్వర ధ్రువపత్రాల జారీ వంటి అంశాలలో విశేష ప్రతిభ కనబరిచారని తెలిపారు.ఐ.ఎస్.ఓ 9001-2015 నాణ్యత నిర్వహణ వ్యవస్థ సర్టిఫికెట్ ను తాడేపల్లి గ్రామీణ అభివృద్ధి శాఖ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ ఎం.వి కృష్ణ తేజ పీలేరు పంచాయతీ డెవలప్మెంట్ అధికారి జ్ఞాన శేఖర్ కు అందజేశారు.ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా తీసుకున్న నిర్ణయాలు,అధికారులకు ఇచ్చిన స్పష్టమైన దిశానిర్దేశం కారణంగానే అన్నమయ్య జిల్లాలో మొదటి గ్రామ పంచాయతీగా పీలేరు పంచాయతీ రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ ఐఎస్ఓ గుర్తింపుతో పీలేరు పంచాయతీ పాలనకు జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించినట్లయిందని పంచాయతీ సిబ్బంది,ప్రజాప్రతినిధులు ఆనందం వ్యక్తం చేశారు.

# ప్రొద్దుటూరులో రూ.27.50 కోట్లతో ఘన వ్యర్థాల నిర్వహణ పనులు

**● డంప్‌యార్డ్‌లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడమే లక్ష్యం: స్వచ్ఛాంధ్ర ఛైర్మన్ పట్టాభిరామ్**



**ప్రొద్దుటూరు మన జనప్రగతి జూలై 17:-**రాష్ట్రాన్ని డంప్‌యార్డ్‌లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. శుక్రవారం ప్రొద్దుటూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి చొరవతో నియోజకవర్గంలో పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించిన స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేస్తున్నామని చెప్పారు.ప్రొద్దుటూరులో రూ.11.50 కోట్లతో ఆధునిక వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రం, రూ.16 కోట్లతో మరో వేస్ట్ ప్రాసెసింగ్ కేంద్రం నిర్మాణం జరుగుతోందని తెలిపారు. దీంతో మొత్తం రూ.27.50 కోట్లతో ఘన వ్యర్థాల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఘన వ్యర్థాల నిర్వహణ నిర్లక్ష్యానికి గురైందని ఆరోపించిన ఆయన, రాష్ట్రవ్యాప్తంగా ఒకటిన్నర కోట్ల టన్నుల చెత్త పేరుకుపోయిందన్నారు. మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి చేస్తున్న విమర్శలు ఆధారరహితమని అన్నారు.రాయలసీమ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి నాయకత్వంలో ప్రొద్దుటూరును పరిశుభ్రమైన ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి కొనసాగుతోందని తెలిపారు.ఈ సమావేశంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ బోర్డు డైరెక్టర్ పర్వీన్ భాను, డాక్టర్ వి.ఎస్. ముక్తియార్, నంద్యాల కొండారెడ్డి, జబీవుల్లా, తోట మహేశ్వరరెడ్డి, ఖలీల్, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ మోడల్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూలై 17:-**పట్టణంలోని శ్రీనివాసనగర్ మున్సిపల్ మోడల్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో దాతల సహకారంతో విద్యా సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొద్దుటూరు డివిజన్ డిప్యూటీ డీఈఓ శివప్రసాద్ విద్యార్థులకు విద్యా సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఈఓ శివప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజూ సకాలంలో పాఠశాలకు హాజరై విద్యపై దృష్టి పెట్టాలని సూచించారు.విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నాణ్యమైన, పోషకాహారంతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందిస్తోందని తెలిపారు.దాతలు అందించిన విద్యా సామాగ్రిని సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు.ఆదరణ సేవా సంస్థ గౌరవాధ్యక్షుడు చిప్పగిరి ప్రసాద్ మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. సంస్థ అధ్యక్షుడు బైసాని సత్యనారాయణ మాట్లాడుతూ..“ప్రార్థించే పెదవుల కన్నా చేయూతనిచ్చే చేతులు మిన్న“ అనే సిద్ధాంతంతో సంస్థ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తోందని తెలిపారు. తన చిన్ననాటి మిత్రులు డాక్టర్ శ్రీరంజన్,ద్వారకనాథ్, సి.వి. సుఖేష్ సహకారంతో రూ.17 వేల విలువైన విద్యా సామాగ్రిని 111 మంది విద్యార్థులకు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ఈ సేవా కార్యక్రమానికి సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు,ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు రమణాచారి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.2 కోట్లతో రిమ్స్‌లో డిజిటల్ రేడియోగ్రఫీ సెంటర్ ప్రారంభం

**● ఎమ్మెల్యే మాధవి,టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస రెడ్డి ప్రారంభం**



**కడప మన జనప్రగతి జూలై 17:-** కడప నగరంలోని రిమ్స్ ఆసుపత్రిలో కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల కింద ఎల్ఐసీ ఆఫ్ ఇండియా మంజూరు చేసిన రూ.2 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన నూతన 1000 ఎంఏ డిజిటల్ రేడియోగ్రఫీ సెంటర్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి, టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ రెడ్డెప్పగారి శ్రీనివాస రెడ్డి శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రిమ్స్‌కు వచ్చే రోగులకు అత్యాధునిక వైద్య పరీక్షలు వేగంగా, నాణ్యంగా అందించేందుకు ఈ డిజిటల్ రేడియోగ్రఫీ సెంటర్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. సామాజిక బాధ్యతతో సీఎస్ఆర్ నిధుల ద్వారా ఈ ప్రాజెక్టును అందించిన ఎల్ఐసీ ఆఫ్ ఇండియా యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో ఎల్ఐసీ సౌత్ సెంట్రల్ జోనల్ మేనేజర్ శర్వాణి రమేష్, రిమ్స్ ఆసుపత్రి అధికారులు, వైద్యులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గుర్తుతెలియని మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించిన మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూలై 17:-**స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో అనారోగ్యంతో మరణించిన గుర్తుతెలియని వ్యక్తికి బంధువులు ఎవరూ ముందుకు రాకపోవడంతో, పోలీసులు మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ టౌన్ అధ్యక్షుడు సుభహాన్‌ను సంప్రదించారు. సమాచారం అందుకున్న వెంటనే ఫౌండేషన్ సభ్యులు స్పందించి, హిందూ స్మశానవాటికలో హిందూ సంప్రదాయాల ప్రకారం గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించారు.ఈ సేవా కార్యక్రమంలో ఫౌండేషన్ ఛైర్మన్ మోరే లక్ష్మణ్ రావు, టౌన్ అధ్యక్షుడు సుభహాన్, నరేంద్ర కుమార్, అశోక్ కుమార్, సతీష్ తదితరులు పాల్గొని అంత్యక్రియలను పూర్తి చేశారు.ఈ సందర్భంగా ఛైర్మన్ మోరే లక్ష్మణ్ రావు మాట్లాడుతూ..సమాజంలో ఎవరూ లేని నిరాధారులకు కూడా గౌరవప్రదమైన అంతిమ సంస్కారాలు జరగాలనే సంకల్పంతో ఈ సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. అవసరంలో ఉన్న వారికి అండగా నిలవడం, మానవతా విలువలను కాపాడడం మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.అదేవిధంగా, ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ అమ్మ శరణాలయంలోని వృద్ధులకు సహాయం చేయదలచిన దాతలు ఈ క్రింది ఫోన్ నంబర్లను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.సంప్రదించవలసిన నంబర్లు:82972 53484, 91822 44150

# వాసవి మాతకు గోరింటాకు అర్చన పూజలు



**వేంపల్లె మన జనప్రగతి జూలై 17:-**ఆషాఢ మాసం పురస్కరించుకుని వేంపల్లె లోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో వాసవి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు తోటంశెట్టి చంద్రశేఖర్,మహిళా మండలి అధ్యక్షురాలు బచ్చు భాగ్యేశ్వరమ్మ తెలిపారు.ఇందులో భాగంగా ఆలయ అర్చకులు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ సిద్ధాంతి నేతృత్వంలో మూలవిరాట్ వాసవి మాతకు పంచామృతాభిషేకం,శ్రీపత్ర (గోరింటాకు) అర్చన,నివేదన, మహామంగళ హారతి,మంత్రపుష్పం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఉత్సవ మూర్తి అమ్మవారిని పీఠంపై కొలువుదీర్చి గోరింటాకుతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సభ్యులు అమ్మవారి పీఠాన్ని భుజాలపై పెట్టుకొని జై వాసవి మాత జై జై వాసవి మాత అంటూ గర్భగుడి చుట్టూ ప్రాకారోత్సవం నిర్వహించారు. మహిళలు వాసవి మాతకు గోరింటాకుతో లలితా సహస్రనామ పారాయణం,అష్టోత్తరం నిర్వహించారు.రోలును పసుపు కుంకుమలతో అలంకరించి పాటలు పాడుతూ గోరింటాకును దంచారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు రాయవరం సుబ్బు,నిర్వాహకులు మిట్టా ప్రవీణ్, మహిళా మండలి కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# ఐడియల్ కళాశాల పూర్వ అధ్యాపకుల, అధ్యాపక ఇతరుల ఆత్మీయ కలయిక



**కాకినాడ మన జనప్రగతి జూలై 17:-**ఐడియల్ కళాశాల ఐదు ఆరు తరాల అధ్యాపకులు, అధ్యాపక ఇతరులు ఈనెల 19వ తేదీ ఆదివారం నాడు కాకినాడ ఇంద్రపాలెం వద్ద గల ఐడియా కళాశాల ఆవరణలో కలుసుకునేందుకు ఒక వేదికను ఏర్పాటు చేసుకున్నారు ఈ వేదికలో ఎన్నో వేల మందికి విద్యాబుద్ధులు బోధించి వాళ్ళని ప్రయోజకులను చేసి ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటూ అందుబాటులో ఉన్నవారు ఎక్కడెక్కడో స్థిరపడిన వారు ఈ కార్యక్రమానికి వచ్చి ఆత్మీయంగా పలకరించుకునేందుకు ఈ వేదిక ఉపయోగపడుతుందని ఇంకా ఎవరైనా తెలియని వారు ఉంటే ఈ పత్రికా ప్రకటన ద్వారా తెలుసుకొని తప్పక రావాలని ఐడియల్ కళాశాల కరస్పాండెంట్ జి.వి కె.వర్మ,కళాశాల సిబ్బంది తెలియజేశారు.

# నీట్‌లో ఆల్ ఇండియా లెవల్లో 3795 ర్యాంక్ సాధించిన విద్యార్థి ప్రవీణ్ కుమార్



**కలికిరి మన జనప్రగతి జూలై 17:-**దేశ వ్యాప్తంగా శుక్రవారం విడుదలైన నీట్ పరీక్షా ఫలితాల్లో కలికిరి మండలం గుండ్లూరు కు చెందిన విద్యార్థి చెర్లోపల్లి ప్రవీణ్ కుమార్ 700 మార్కులకు గాను 628 మార్కులతో ఆల్ ఇండియా లెవల్లో 3795 ర్యాంకు సాధించాడు. విద్యార్థి తండ్రి చెర్లోపల్లి రమేష్ బాబు బిఎస్ఎన్ఎల్ ఉద్యోగి కాగా.. తల్లి గృహిణి వారి కుమారుడు చెర్లోపల్లి ప్రవీణ్ కుమార్ కలికిరి సైనిక్ స్కూల్ నందు 6 వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు చదివాడు. నేడు విడుదలైన ఆల్ ఇండియా నీట్ పరీక్షలో మొదటి ప్రయత్నములోనే ఆల్ ఇండియా ర్యాంక్ 3795 సాధించడంతో తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ఈ సందర్భంగా విద్యార్థి తండ్రి రమేష్ బాబు మాట్లాడుతూ ప్రవీణ్ కుమార్ చిన్నప్పటి నుంచి క్రమశిక్షణ, సమయ పాలన, అంకిత భావం,పట్టుదల కలిగి ప్రాథమిక స్థాయి నుంచి మంచి మార్కులు సాధించడం తో పాటు తన కృషితో నేడు నీట్ పరీక్షలో విజయం సాధించాడని తమ హర్షం వ్యక్తంచేశారు.నీట్ లో ఆల్ ఇండియా ర్యాంకుతో విజయం సాధించిన ప్రవీణ్ కుమార్ ను వెంకట కృష్ణయ్య, టీచర్ సి.నాగరాజు, కలికిరి మండల స్వచ్ఛ భారత్ మిషన్ రిసోర్స్ కోఆర్డినేటర్ శంకర్, తదితరులు అభినందించారు.

# స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర అవగాహన ర్యాలీ



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూలై 17:**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పులివెందుల పట్టణంలో నేడు ప్రత్యేక అవగాహన కార్యక్రమం,ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పులివెందుల మున్సిపల్ కమిషనర్ సి.మునికుమార్ తెలిపారు.ఉదయం 8:30 గంటలకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు పులివెందుల పురపాలక సంఘం కమిషనర్ తెలిపారు.పట్టణంలో ఎక్కువగా వ్యర్థాలను ఉత్పత్తి చేసే బల్క్ వేస్ట్ జనరేటర్స్ ను ఉద్దేశించి ప్రతిజ్ఞ,అవగాహన కార్యక్రమం జరగనుందని గౌరవ రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ మరియు పులివెందుల స్పెషల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించబడుతుందన్నారు.బి.ఎస్.ఎన్.ఎల్ ఆఫీస్ సమీపంలోని మెప్మా కార్యాలయం నుండి ఉదయం 8:30 గంటలకు ర్యాలీ ప్రారంభమవుతుందని మెప్మా ఆఫీస్ నుంచి పట్టణంలోని ప్రముఖ కూడలి అయిన పూలంగళ్ళ సర్కిల్ వరకు ఈ ర్యాలీ కొనసాగుతుందన్నారు.పట్టణాన్ని స్వచ్ఛంగా, సుందరంగా తీర్చిదిద్దేందుకు ఉద్దేశించిన ఈ స్వచ్ఛత కార్యక్రమంలో పులివెందుల పట్టణ ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థలు మరియు పుర ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని,ఈ ర్యాలీని విజయవంతం చేయాలని పురపాలక సంఘ కమిషనర్ కోరారు.

# ఉపాధ్యాయుల ఇంట ర్యాంకుల పంట..

**• నీట్‌లో ఆల్ ఇండియా 316వ ర్యాంక్ సాధించిన షణ్ముఖ రోహిత్ రాజు**



**పీలేరు మన జనప్రగతి జులై 17:–**ఉపాధ్యాయ దంపతుల ఇంట మరో విజయగాథ వెలుగుచూసింది. పీలేరులో నివాసం ఉంటున్న కలకడ మండలం పాపిరెడ్డిగారిపల్లి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు డి. పరమేశ్వర రాజు, రొంపిచర్ల హైస్కూల్ సోషల్ టీచర్ వి.విజయలక్ష్మి దంపతుల కుమారుడు డి. షణ్ముఖ రోహిత్ రాజు నీట్ పరీక్షలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించారు. నీట్‌లో 720 మార్కులకు గాను 680 మార్కులు సాధించిన రోహిత్ ఆల్ ఇండియా 316వ ర్యాంక్ సాధించారు. ఈ ఘనతతో తల్లిదండ్రులకు, పాఠశాలలకు పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చారు. మధ్యతరగతి రైతు కుటుంబం నుంచి వచ్చిన పరమేశ్వర రాజు ఉపాధ్యాయుడిగా ప్రస్థానం ప్రారంభించి, కల్లూరు, బాకరాపేట పాఠశాలల్లో గణిత ఉపాధ్యాయుడిగా సేవలందించారు. ప్రస్తుతం కలకడ మండలంలోని పాపిరెడ్డిగారిపల్లి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. తల్లిదండ్రులిద్దరూ ఉపాధ్యాయులుగా ఉంటూ వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు మార్గనిర్దేశం చేస్తున్న నేపథ్యంలో, వారి కుమారుడు సాధించిన ఈ విజయం పలువురికి ఆదర్శంగా నిలిచింది. రోహిత్ విజయంపై ఉపాధ్యాయ సంఘాలు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# బాధితులకు మర్యాదపూర్వక సేవలు అందించి న్యాయం చేయాలి



**చిట్వేలి మన జనప్రగతి జూలై 17:–** బాధితులకు మర్యాదపూర్వకంగా సేవలు అందిస్తూ సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు అధికారులకు సూచించారు. చిట్వేలి పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ పోలీస్ స్టేషన్లలో నమోదవుతున్న కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల పరిష్కారం, శాంతిభద్రతల నిర్వహణ, సైబర్ నేరాల నివారణ, మహిళల భద్రత, మాదకద్రవ్యాల నిర్మూలన, ప్రజల్లో అవగాహన కార్యక్రమాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. రాబోయే ఎన్నికల దృష్ట్యా ప్రత్యేక ఆదేశాలు జారీ చేస్తూ, పోలీస్ సిబ్బంది తమ పరిధిలోని గ్రామాలను తరచూ సందర్శించి స్థానిక పరిస్థితులపై సమగ్ర సమాచారం సేకరించాలని సూచించారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే అవకాశాన్ని గుర్తించి, అవసరమైన బైండ్ ఓవర్ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామాలలో పరిణామాలు, వివాదాలు, రాజకీయ పరిస్థితులు ఇతర సున్నితమైన అంశాలను ఎప్పటికప్పుడు పై అధికారులకు నివేదిస్తూ అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ చట్టవ్యవస్థను పటిష్ఠంగా అమలు చేయాలని, శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డీఎస్పీ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే కోడూరు గ్రామీణ పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు, చిట్వేలి, పెనగలూరు, ఓబులవారిపల్లి, పుల్లంపేట పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.


# విద్యార్థులు చిన్నప్పటి నుంచే సేవాభావాన్ని అలవర్చుకోవాలి

**• ప్రధానోపాధ్యాయులు వన్నూరప్ప**




**పత్తికొండ మన జనప్రగతి జూలై 17:–**విద్యార్థులు చదువుతో పాటు చిన్నప్పటి నుంచే సేవాభావాన్ని అలవర్చుకోవాలని పత్తికొండ ఎంపీపీ ఆది ఆంధ్ర పాఠశాల ప్రధానోపాధ్యాయులు వన్నూరప్ప, యువ స్పందన సొసైటీ ఉపాధ్యక్షుడు లక్ష్మన్న సూచించారు. పత్తికొండ పట్టణంలోని ఎంపీపీ ఆది ఆంధ్ర పాఠశాలలో శుక్రవారం చందోలి గ్రామానికి చెందిన రవిశేఖర్ రెడ్డి కుమార్తె, బీటెక్ విద్యార్థిని వైష్ణవి ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల సమాజానికి ఉపయోగపడే అవకాశం లభిస్తుందని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం బీటెక్ విద్యార్థిని వైష్ణవి మాట్లాడుతూ.. యువ స్పందన సొసైటీ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు తన వంతు సహాయంగా విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, చందోలి రవిశేఖర్ రెడ్డి, బీటెక్ విద్యార్థిని వైష్ణవి, విద్యార్థులు పాల్గొన్నారు.


# గ్రేడ్-2 హాస్టల్ వార్డెన్లకు పదోన్నతుల మార్గం సుగమం



**అమరావతి మన జనప్రగతి జూలై 17:–** బీసీ హాస్టళ్లలో పనిచేస్తున్న 300 మందికిపైగా గ్రేడ్–2 హాస్టల్ వార్డెన్లకు పదోన్నతుల మార్గం సుగమమైంది. గ్రేడ్–1 వార్డెన్లుగా పదోన్నతులు కల్పించేందుకు అవసరమైన సర్వీస్ రూల్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం రూపొందించి ఉత్తర్వులు జారీ చేసింది. 2008 నుంచి సర్వీస్ రూల్స్ లేక పదోన్నతులు పొందలేకపోతున్న వార్డెన్ల సమస్యను మంత్రి ఎస్. సవిత సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఉద్యోగంలో చేరిన నాటి సీనియార్టీ ఆధారంగా భవిష్యత్తులో పదోన్నతులు కల్పించనున్నారు. ఈ నిర్ణయంతో ఎన్నేళ్లుగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న గ్రేడ్–2 వార్డెన్లు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం చంద్రబాబు, మంత్రి సవితకు కృతజ్ఞతలు తెలిపారు.

# గవిమఠం భూముల లీజు వేలానికి కోర్టు గ్రీన్ సిగ్నల్









## ప్రైవేటు వ్యక్తుల ఇంజంక్షన్ పిటిషన్ కొట్టివేత..తాత్కాలిక స్టే రద్దు

**ఉరవకొండ మన జనప్రగతి జూలై 17:–**ఉరవకొండ శ్రీ గవిమఠం సంస్థానానికి చెందిన భూముల లీజు వేలానికి ఉన్న న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోయాయి. భూములపై హక్కులు తమకే ఉన్నాయని పేర్కొంటూ ప్రైవేటు వ్యక్తులు దాఖలు చేసిన ఇంజంక్షన్ పిటిషన్‌ను బళ్లారి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టు కొట్టివేసింది. గతంలో ఇచ్చిన తాత్కాలిక స్టే ఉత్తర్వులను సైతం రద్దు చేయడంతో లీజు వేలానికి మార్గం సుగమమైంది. చెల్లగుర్కి గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 114బి (19.05 ఎకరాలు), 111బి (3.35 ఎకరాలు) భూములు తమ కుటుంబానికి రయత్వారీ పట్టా ద్వారా వచ్చాయని పేర్కొంటూ రుషభేంద్ర స్వామి, మంజునాథ్, శశికళ, జ్ఞానేశ్వరి కోర్టును ఆశ్రయించారు. గవిమఠం ఈ భూములను లీజుకు ఇవ్వకుండా అడ్డుకోవాలని కోరుతూ మధ్యంతర ఇంజంక్షన్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే గవిమఠం సంస్థానం తరఫున దాఖలైన కౌంటర్‌లో ఈ భూములు దేవదాయ శాఖ ఆధీనంలోని గవిమఠం ఆస్తులేనని స్పష్టం చేశారు. గతంలో కొందరు అధికారులు అధికార దుర్వినియోగంతో అక్రమ మ్యుటేషన్ చేయించారని, దీనిపై శాఖాపరమైన చర్యలతో పాటు క్రిమినల్ కేసు కూడా నమోదైందని కోర్టుకు వివరించారు. ఇరుపక్షాల వాదనలు, ఆధారాలను పరిశీలించిన న్యాయస్థానం యాజమాన్య హక్కులపై వివాదం ఉన్నప్పుడు కేవలం ఇంజంక్షన్ కోరడం సరిపోదని పేర్కొంది. ముందుగా హక్కుల ప్రకటన కోసం డిక్లరేషన్ దావా దాఖలు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. వాదులు తమ హక్కులను ప్రాథమికంగా కూడా నిరూపించలేకపోయారని అభిప్రాయపడుతూ పిటిషన్‌ను కొట్టివేసింది. ఈ తీర్పుతో గవిమఠం భూముల లీజు వేలానికి ఉన్న న్యాయపరమైన అడ్డంకులు తొలగినట్లు భావిస్తున్నారు. గతంలో ఇన్‌చార్జి సహాయ కమిషనర్ స్థాయిలో వేలం ప్రక్రియకు ఆటంకాలు ఏర్పడ్డాయని, అనంతరం బాధ్యతలు చేపట్టిన అధికారులు వేలానికి చర్యలు ప్రారంభించారని భక్తులు పేర్కొంటున్నారు. అయితే చివరి నిమిషంలో వేలం తాత్కాలికంగా వాయిదా పడటంతో భక్తుల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కోర్టు తీర్పు నేపథ్యంలో త్వరలోనే వేలం నిర్వహిస్తారా లేదా అన్న దానిపై ఆసక్తి నెలకొంది.

# ప్రభుత్వ వైఫల్యం గురించి ప్రజల్లోకి తీసుకువెళ్లండి

**కూటమిప్రభుత్వాన్ని గద్దె దించేందుకు రాష్ట్ర ప్రజలు ఎదురుచూపు**

**మనకు మంచి రోజులు వస్తాయి,అధైర్యపడవద్దు**

**ప్రజాసమస్యల పరిష్కార ధ్యేయమే వైకాపా లక్ష్యం**

**ప్రజాదర్బార్‌లో ఎంపీ అవినాష్ రెడ్డి**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూలై 17:**ఎల్లకాలము ఒకే రోజులు ఉండవని,నాయకులు కార్యకర్తలు ఎవరు అధైర్యపడవద్దని వైకాపా పార్టీ మీకు ఎల్లవేళలా అండగా ఉంటుందని, రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాలు నత్తనడకన నడుస్తున్నాయని,ఇచ్చిన హామీలను నెరవేర్చక ప్రజలను వెన్నుపోటు పొడిచిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని,ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రజల్లోకి తీసుకోవాలని,ప్రజా సమస్యల పరిష్కారమే వైకాపా పార్టీ ధ్యేయమ, ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఎంపీ అవినాష్ రెడ్డి అన్నారు. శుక్రవారంఆయన నివాస ప్రాంగణంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ప్రజలకు మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం హామీలు నెరవేర్చడంలో విఫలమైందన్నారు. ఎన్నికల ముందు చెప్పిన హామీలు నత్తనడకన నడుస్తున్నాయని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కి 25 నెలలు అవుతున్న ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. విద్యార్థులను, నిరుద్యోగులను నిలువెత్తున మోసం చేసిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అన్నారు. 25 నెలల పాలనలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చలేక పోయిందన్నారు. కూటమి నాయకులు చెప్పిన మాయమాటలు నమ్మి ఓటు వేసిన ప్రజలకు ప్రభుత్వం వెన్నుపోటు పొడుస్తుంది అన్నారు. వెన్నుపోటు ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రజలు అన్ని గమనిస్తూనే ఉన్నారన్నారు. అంతకు ముందుగా పులివెందులనియోజకవర్గం ప్రజలు ఇతర ప్రాంతాల ప్రజలు ఆయననుకలిసి వినతిపత్రాలను అందజేశారు. మరి కొంతమంది సమస్యలను ఆయనకు నేరుగా వివరించారు. ఆయన వారి సమస్యలను సావాదానంగా విని వారి సమస్యలను పరిష్కరింపజేసేందుకు కృషి చేస్తా అన్నారు. మరి కొంతమంది సమస్యలను అధికారులతో శరవాణిలో మాట్లాడి పరిష్కరింపజేశారు.

# సహకార పరపతి సంఘాల ద్వారా రైతులకు అందుబాటులో ఎరువులు





**• రైతులకు సకాలంలో రుణాలు కూడా అందిస్తున్నాం • రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు పుత్త నరసింహారెడ్డి**

**చెన్నూరు మన జనప్రగతి జూలై 17:–**ప్రాథమిక సహకార పరపతి సంఘాల (సొసైటీల) ద్వారా రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచుతున్నామని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పుత్త నరసింహారెడ్డి తెలిపారు. చెన్నూరు ప్రాథమిక సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతుల ఎరువుల గోడౌన్‌ను, ఆధునీకరించిన సొసైటీ భవనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం గోడౌన్ నుంచి రైతులకు ఎరువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పుత్త నరసింహారెడ్డి మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువుల సరఫరా చేపడుతున్నామని తెలిపారు. అలాగే సహకార సంఘాల ద్వారా రైతులకు సకాలంలో రుణాలు అందించే చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి మాదినేని వెంకటసుబ్బయ్య, చెన్నూరు సొసైటీ అధ్యక్షుడు ముల్ల శ్రీనివాసులు రెడ్డి, కడప కే.సీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ తాడిగొట్ల వెంకటసుబ్బారెడ్డి, మాజీ గ్రంథాలయ చైర్మన్ జి. రామకోటి రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు కల్లూరు విజయభాస్కర్ రెడ్డి, ఎంపీడీవో కిరణ్ మోహన్ రావు, మండల వ్యవసాయ అధికారి శ్రీదేవి, సహకార సంఘం డైరెక్టర్లు, రైతులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం: ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

**• ఆలయ పునర్నిర్మాణానికి రూ.3.70 కోట్ల నిధులు**



**బొమ్మనహాల్ మన జనప్రగతి జూలై 17:–**రాయదుర్గం నియోజకవర్గంలో అత్యంత ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలలో ఒకటైన బొమ్మనహాల్ మండలం నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు త్వరలోనే శ్రీకారం చుడుతున్నామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. నేమకల్లులో శుక్రవారం జరిగిన ఆలయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నేమకల్లు పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు ఆలయ పునర్నిర్మాణానికి రూ. 3.70 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ నిధులతో ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం కానుండటం భక్తులకు సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. రాయదుర్గం నియోజకవర్గంలోని నేమకల్లు ఆంజనేయస్వామి దేవస్థానం, మురడి ఆంజనేయస్వామి దేవాలయాలతో పాటు కసాపురం ఆంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు ఒకే సారి చేపట్టడం విశేషమన్నారు. ఈ పనులు వేగంగా పూర్తై, ఆలయాల వైభవం మరింత పెరగాలని ఆకాంక్షించారు. శ్రావణమాసంలో ఈ మూడు ఆంజనేయస్వామి ఆలయాలను ఒకే రోజు దర్శిస్తే... శుభఫలితాలు కలుగుతాయని వేలాది మంది భక్తుల విశ్వాసమని గుర్తు చేశారు. ఆలయాల అభివృద్ధితో భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయన్నారు. గుంతకల్లు నియోజకవర్గంలోని కసాపురం ఆలయ పునర్నిర్మాణ పనులు స్థానిక ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆధ్వర్యంలో చేపడుతున్నారని తెలిపారు. రాయదుర్గం పరిధిలోని ఆలయాల పునర్నిర్మాణ పనులు సమాంతరంగా ప్రారంభం కావడం ఆనందదాయకమైన పరిణామమన్నారు. ఆంజనేయస్వామి కృపతో ఈ పనులు నిర్దేశిత గడువులో పూర్తై భక్తులకు అంకితం కావాలని ఎమ్మెల్యే కాలవ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కురుబ మల్లెన్న, కొత్తపల్లి మల్లికార్జున, తిమ్మరాజు, ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీనాథ్, బసప్ప, హనుమంతరెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్మెంట్ కింద రూ.6300 కోట్ల బకాయిలను సత్వరం విడుదల చేయండి

## మాజీ ఎంపీ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లె మన జనప్రగతి జులై 17:**-రాష్ట్రంలోని విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ కింద ఉన్న రూ 6300 కోట్ల బకాయిలను సత్వరం విడుదల చేయాలని రాజ్యసభ మాజీ సభ్యుడు , కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వేంపల్లి లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పేద విద్యార్థులు కూడా ఉన్నత చదువులు చదవాలన్న ఉన్నత ఆశయంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం 2008 -09 విద్యా సంవత్సరం నుంచి ఇంటర్, పాలిటెక్నిక్, ఐటిఐ, డిగ్రీ, ఇంజనీరింగ్,ఫార్మసీ,పీజీ కోర్సులు చదివే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ పథకాలను ప్రారంభించిందన్నారు ఈ పథకాల ద్వారా ఎంతోమంది పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదివి, ఉన్నత ఉద్యోగాలు పొంది,ఉన్నత జీవన ప్రమాణాలతో జీవిస్తున్నారన్నారు .అటువంటి ఉదాత్తమమైన పథకాన్ని చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం అత్యంత దురదృష్టకరమన్నారు. ఫీజు రీయింబర్స్మెంట్ పథకం కింద అనగా విద్యాదీవెన పథకం కింద ఒక్కొక్క క్వార్టర్ కు 700 కోట్ల రూపాయలు చొప్పున 9 క్వార్టర్లకు కలిపి 6300 కోట్ల రూపాయలు ప్రభుత్వ బకాయిలు ఉన్నాయని తులసి రెడ్డి గుర్తు చేశారు.అదేవిధంగా స్కాలర్షిప్ పథకం కింద వసతి దీవెన పథకం కింద సంవత్సరానికి 1100 కోట్ల రూపాయల చొప్పున రెండు సంవత్సరాలకు కలిపి రూ 2200 కోట్ల రూపాయలు బకాయిలు ఉన్నాయన్నారు.ఈ రెండు పథకాల కింద కలిపి మొత్తం రూ.8500 కోట్ల రూపాయలు బకాయిలు ఉన్నాయని, సిబ్బందికి జీతాలు ఇవ్వలేక,కరెంటు బిల్లులు కట్టలేక కళాశాల యాజమాన్యాలు ఆర్థిక సుడిగుండంలో చిక్కుకున్నాయన్నారు .ఒరిజినల్ సర్టిఫికెట్లు అందని కారణంగా విద్యార్థులు పై చదువులకు పోలేక,ఉద్యోగ అన్వేషణకు పోలేక నిరాశ నిస్పృహలతో కొట్టుమిట్టాడుతున్నా రన్నారు. ఈ విషయంలో విద్యార్థులు ,వారి తల్లిదండ్రుల ఆవేదన వర్ణనా తీతంగా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు చేపట్టి ఫీజు రియంబర్స్మెంట్,స్కాలర్షిప్ పథకాల కింద చెల్లించాల్సిన రూ 8500 కోట్ల రూపాయల బకాయిలను వెంటనే విడుదల చేయాలని తులసి రెడ్డి కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# నీట్ ఫలితాల్లో ఆదిత్యకు జాతీయ ర్యాంకులు



**కాకినాడ మన జనప్రగతి జూలై 17:**-ఎన్టీఏ ప్రకటించిన నీట్-2026 ఫలితాలలో ఆదిత్య విద్యార్థులు మరోసారి ఆలిండియా జాతీయ ర్యాంకులు దక్కించుకుని ఆదిత్య విద్యా పటిమను ఇనుమడింపచేశారు.ఆల్ ఇండియా ర్యాంకుల్లో వి.వి.ఎన్.డి.శ్రీరామ్ 220వ ర్యాంకు, గంటి సాయి అభినవ్ 529వ ర్యాంకు,కె.తస్విక 549వ ర్యాంకు, ఎమ్.అభిరామ్ రాజు 925వ ర్యాంకు,డి.ఎన్.సాయిమణికంఠ 969వ ర్యాంకులను సాధించారని ఆదిత్య విద్యాసంస్థల సెక్రటరీ ఎన్.కె. దీపక్ రెడ్డి తెలిపారు.అలిండియా నీట్ ఫలితాలలో 550 మార్కులు పైన 30 మంది విద్యార్థులు, అత్యున్నత మార్కులు సాధించి, ఆంధ్రప్రదేశ్ విద్యారంగంలో 'ఆదిత్య' అగ్రగామియని ఋజువు చేసుకొందని, ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ ఎన్.శేషారెడ్డి అన్నారు. ప్రతి ఒక్క విద్యార్థికి తగినన్ని టెస్టులతో ప్రాక్టీసు చేయించామని తెలిపారు.ఈ సందర్భంగా విజేతలను ఆదిత్య విద్యాసంస్థల సెక్రటరీ ఎన్.కె.దీపక్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్ అడ్మిషన్లు ఆదిత్య గంగరాజు నగర్, మారికవలస, విశాఖపట్నంలో ప్రారంభించినట్టు తెలిపారు.

# మన ఇంటి పరిసరాల పరిశుభ్రతతోనే విషజ్వరాలకు చెక్..





**బొమ్మనహాల్ మన జనప్రగతి జూలై 17:-** మండల పరిధిలో ఉద్దేహాల్ బీసీ కాలనీ ప్రజలకు మన ఆరోగ్యం.. మన చేతుల్లోనే అనే నినాదంతో పరిసరాల పరిశుభ్రత,ఆరోగ్య భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు,ఈ సందర్భంగా ఆరోగ్య కార్యకర్త గోవర్ధన్ మాట్లాడుతూ..ఇంటి పరిసరాల్లో ఉన్న పాత్రలు,డ్రమ్ములు,తొట్లు, పాత టెంకాయ చిప్పలు వంటి వాటిలో నిల్వ ఉన్న నీటిని వారానికి ఒకసారి తప్పనిసరిగా తొలగించి,దోమల ఉత్పత్తిని నివారించాలని ప్రజలకు సూచించారు,అలాగే దోమల కాటుకు గురికాకుండా దోమతెరలు వినియోగించాలని, ప్రతి శుక్రవారం "ఫ్రైడే డ్రైడే" పాటించాలని తెలిపారు, ఇలా చేయడం ద్వారా మలేరియా, డెంగ్యూ,చికున్‌గున్యా వంటి దోమల ద్వారా వ్యాపించే విషజ్వరాలను నివారించి కుటుంబ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వివరించారు, ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త గోవర్ధన్,ఆశా కార్యకర్తలు ఈరమ్మ,లక్ష్మి, హరిత లక్ష్మితో పాటు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# గారంపల్లి పాఠశాల ఘటనపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి

**- ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు అన్నమయ్య జిల్లా ఎమ్మార్పీఎస్ నేతల ఫిర్యాదు**







**పీలేరు మన జనప్రగతి జూలై 17:**-ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్. జవహర్‌ను అన్నమయ్య జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకులు కలిసి, కేవీ పల్లి మండలం గారంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చోటుచేసుకున్న ఘటనలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా పీలేరు నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి గండికోట వెంకటేష్ మాట్లాడుతూ, పదో తరగతి విద్యార్థులకు టీసీలు ఇచ్చే సమయంలో ప్రధానోపాధ్యాయురాలు సరస్వతి డొనేషన్ పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై విచారణ జరపాలని కోరినట్లు తెలిపారు.అలాగే పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సదాశివ నాయుడు, వైస్ చైర్మన్ సుభహాన్‌లు దళిత మైనర్ విద్యార్థి నాగార్జునపై అనుచిత వ్యాఖ్యలు చేసి, సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టి అవమానించారని ఆరోపిస్తూ, వారిపై ఎస్సీ, ఎస్టీ (అత్యాచార నిరోధక) చట్టం కింద కేసు నమోదు చేయాలని ఎస్సీ కమిషన్‌ను కోరినట్లు తెలిపారు.ఈ ఫిర్యాదుపై జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారులతో మాట్లాడి సమగ్ర విచారణ జరిపించి విద్యార్థికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎస్సీ కమిషన్ చైర్మన్ హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ముల్లంగి రెడ్డప్ప, కలకడ మండల అధ్యక్షుడు వంగిమల్ల హరినాథ్, బాధిత విద్యార్థి నాగార్జున, అతని కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# జీవితం అమూల్యమైనది - ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి: సిడిపిఓ రాజమ్మ

**పీలేరు మన జనప్రగతి జూలై 17:**-పీలేరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ రాజమ్మ మాట్లాడుతూ "జీవితం అమూల్యమైనది - ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి" తెలిపారు.ఈ మానసిక ఒత్తిడి, ఆందోళన, నిరాశ వంటి సమస్యలు ఎదురైనప్పుడు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని, అవసరమైతే కుటుంబ సభ్యులు, స్నేహితులు, నిపుణుల సహాయం తీసుకోవాలని సిడిపిఓ రాజమ్మ సూచించారు. అలాగే టెలి మానస్ (14416), మహిళా హెల్ప్‌లైన్ (181), చైల్డ్ హెల్ప్‌లైన్ (1098) వంటి సేవలను అవసరమైనప్పుడు వినియోగించుకోవాలని తెలిపారు.ఆత్మహత్య నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, గ్రామస్థాయిలో ప్రజల్లో మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ, అవసరమైన వారికి సకాలంలో సహాయం అందేలా కృషి చేయాలని అధికారులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ "జీవితం అమూల్యమైనది ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రతిజ్ఞ చేశారు..ఈ కార్యక్రమంలో పీలేరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని పీలేరు, కాలకడ, కేవీపల్లి మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు,ఎన్.పి. స్వరూప, పి.స్వర్ణ, అక్కయ్య ఉమ (పీలేరు సూపర్వైజర్లు) మరియు శాంతా కలకడ సూపర్వైజర్,తదితరులు పాల్గొన్నారు

# రక్తదానం మహాదానం..ఒక చుక్క రక్తం ఒక ప్రాణానికి ఆశాకిరణం

**- స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్ బాబు,డీఎస్పీ కృష్ణమోహన్**




**అన్నమయ్య జిల్లా ప్రతినిధి మన జనప్రగతి జూలై 17:-** రక్తదానం అనేది మరో మనిషికి కొత్త జీవితాన్ని అందించే మహోన్నత సేవ అని రాజంపేట పార్లమెంట్ టీడీపీ జిల్లా అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్ బాబు, రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ అన్నారు.అన్నమయ్య జిల్లా సౌండ్ సిస్టం డీజే ఓనర్స్ అసోసియేషన్ తొలి వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని వారు కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రమాదాలు, అత్యవసర చికిత్సలు, ప్రసవాలు, శస్త్రచికిత్సల సమయంలో రక్తం అవసరమయ్యే వారికి స్వచ్ఛంద రక్తదాతలు ప్రాణదాతలుగా నిలుస్తారని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఆరోగ్యవంతుడు క్రమం తప్పకుండా రక్తదానం చేసి సమాజ సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.రక్తదానం వల్ల ఎలాంటి హాని ఉండదని, ఆరోగ్యపరంగా కూడా ప్రయోజనాలు ఉంటాయని వివరించారు. సేవా కార్యక్రమంతో తొలి వార్షికోత్సవాన్ని నిర్వహించిన డీజే ఓనర్స్ అసోసియేషన్ సభ్యులను అభినందించారు.రక్తదానం చేసిన యువకులకు నిర్వాహకులు ప్రశంసాపత్రాలు అందించి సత్కరించారు.కార్యక్రమంలో పాల్గొన్న అతిథులను డీజే ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు.

# వాయల్పాడు,గుర్రంకొండ పోలీస్ స్టేషన్లను తనిఖీ చేసిన డీఐజీ కోయ ప్రవీణ్

**● బాధితులకు సత్వర న్యాయం అందించాలి ● పోలీసు సిబ్బందికి డీఐజీ సూచన..**






**వాయల్పాడు మన జనప్రగతి జూలై 17:**-కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ శుక్రవారం మదనపల్లి జిల్లా పోలీసు కార్యాలయాన్ని సందర్శించారు.అనంతరం జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లితో కలిసి వాయల్పాడు, గుర్రంకొండ పోలీస్ స్టేషన్లను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ రికార్డులు, నిర్వహణ తీరును పరిశీలించిన డీఐజీ.. స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా వ్యవహరించి వారికి సత్వర న్యాయం అందించాలని సిబ్బందికి సూచించారు. సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నిర్మూలన, మహిళల భద్రత, సీసీ కెమెరాల వినియోగంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించా రు. లోక్ అదాలత్ ద్వారా పెండింగ్ కేసులు, ట్రాఫిక్ చలాన్ల పరిష్కారానికి చర్యలు వేగవంతం చేయాలని, పోలీస్ స్టేషన్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ కృష్ణమోహన్, సీఐ రాఘవరెడ్డి, ఎస్ఐలు తిప్పేస్వామి, రవీంద్రబాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సీపీఐ పార్టీలో చేరిన ఉంతకల్లు మాజీ సర్పంచ్,పి.సులేమాన్




**బొమ్మనహాల్ మన జనప్రగతి జూలై 17:-** రాయదుర్గం నియోజకవర్గంలో సీపీఐ పార్టీ బలోపేతం దిశగా బొమ్మనహాల్ మండల పరిధిలో ఉంతకల్లు గ్రామ మాజీ సర్పంచ్ పీ.సులేమాన్ తో పాటు పలువురు కలసి నియోజకవర్గ కార్యదర్శి ఎం.నాగార్జున అధ్వర్యంలో సీపీఐ పార్టీ కండువా వేసుకుని అధికారికంగా పార్టీలోకి చేరారు.ఈసందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఎం.నాగార్జున మాట్లాడుతూ.. నూతనంగా పార్టీలోకి చేరిన వారికి 2026 సంవత్సరానికి సంబంధించిన సభ్యత్వ కార్డులను అందజేసి పార్టీ ప్రతిజ్ఞ చేయించారు,అదేవిదంగా ప్రజా సమస్యలపై సీపీఐ నిరంతరం నిర్వహిస్తున్న ఉద్యమాలు, పోరాటాలకు పార్టీ ఎల్లపుడూ అందుబాటులో ఉంటుందన్నారు ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ సులేమాన్ తో పాటు హనుమంతురాయుడు,గోవిందు, రామాంజీ,గౌస్ పీర్, వన్నూరుస్వామి,తదితరులు పార్టీలో చేరడం సంతోషకరమన్నారు.అదేవిధంగా సీపీఐ పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ కార్మికులు,రైతులు, శ్రామిక ప్రజల హక్కుల సాధన కోసం నిబద్ధతతో కృషి చేయాలని సూచించారు, వ్యక్తిగత ప్రయోజనాల కంటే పార్టీ,ప్రజల ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇవ్వాలని,పార్టీ నియమ నిబంధనలను పాటిస్తూ ప్రజా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొనాలని నూతన సభ్యులకు పిలుపునిచ్చారు.ఈకార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి తిప్పేస్వామి,ఏఐవైఎఫ్ అనంతపురం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కావలి కోట్రేష్, ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా కోశాధికారి ఆంజనేయులు, సీపీఐ పట్టణ కార్యదర్శి రవీంద్రనాథ్,కుమార్ నాయక్, విష్ణు,తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174